


భారత్ ఘోర పరాజయం 08

కథనం డైలీ

విలేకరులు కావలెను



కథనం తెలుగు దినపత్రిక లో - జర్నలిస్టులకు అవకాశం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జ్ లు, నియోజకవర్గ ఆర్సీలు, మండల రిపోర్టర్లు కావలెను

- నిజాలను నిర్భయంగా రాసే వారికి అవకాశం
- ఎటువంటి టార్గెట్స్ లేవు

సంప్రదించండి:

ఖమ్మం	శనివారం	14.11.2026	సంపుటి : 1	సంచిక :110	పేజీలు : 8	వెల : 4/-
KHAMMAM	Saturday	14.11.2026	volume : 1	Issue : 110	Pages : 8	Cost : 4/-

ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో
అనూహ్య పరిణామాలు

కేంద్రం నా ఫోన్ ట్యాప్ చేసినా నష్టం లేదు : సీఎం రేవంత్‌రెడ్డి

పెట్టుబడుల ఆకర్షణకే సమిట్

తెలంగాణ అనుకూలమని చాటడమే లక్ష్యం

విపక్షాలు గుడ్డిగా వ్యతిరేకిస్తున్నాయి..

వాటి తీరుతో రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం

బీజేపీ, బీఆర్ఎస్‌లపై సీఎం మండిపాటు



> ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో అనూహ్య పరిణామాలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం.. మీడియాతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. "కేంద్రం నా ఫోన్ ట్యాప్ చేసినా నష్టం లేదు.. నేను ఏది మాట్లాడినా బహిరంగమే. ఖేలో ఇండియా పోటీలకు ఆహ్వానించేందుకే ఎల్లుండి ప్రధాని మోదీతో భేటీ. మియాపూర్ భూముల వేలాన్ని అడ్డుకుంటామన్న బీఆర్ఎస్ పెద్దలకు డబ్బుల కోసమే. ఉద్యమం సమయంలో ల్యాంకో హిల్స్, పద్మాలయ భూములపై రాద్ధాంతం చేశారు అని సీఎం తెలిపారు.

హైదరాబాద్, కథనం ప్రతినిధి : రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలమని ప్రపం చానికి చాటేందుకే భారత సమిట్ నిర్వహిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గత ఏడాది కూడా గ్లోబల్ సమిట్‌కు ముందు భారత్ సమిట్ నిర్వహించామని, ఈసారి డిసెంబరు 7-9 తేదీల్లో గ్లోబల్ సమిట్ నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వివేక్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, కాం గ్రెస్ నేతలు సల్మాన్‌ఖుర్షీద్, గురుదీ ప్‌సింగ్ సప్పల్‌తో కలిసి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సీఎం శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లా డారు. "గ్లోబల్ సమిట్ కర్టెన్‌రైజర్‌లో భాగంగానే బెంగళూరు, దిల్లీ, చెన్నైలలో కార్యక్రమాలు నిర్వహిం చాం. త్వరలోనే ముంబయి, అహ్మ దాబాద్‌లలో నిర్వహించబోతున్నాం. నవంబరు 13, 14 తేదీల్లో భారత్ సమిట్‌కు హాజరయ్యేందుకు 70 దేశాలకు చెందిన వెయ్యి మంది ప్రతినిధులను ఆహ్వానించాం. వారి లో కొందరికి ముందుగా అనుమతు లిచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆఖరి నిమిషంలో వీసాలను రద్దు చేసింది. భారత్ సమిట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగమవుతుందని కిషన్‌రెడ్డి, రామచందర్ రావు, కేటీఆర్ ఆరోపిస్తున్నారు. తెలంగాణ ప్రజలకు అనుకూలంగా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా వారు మాత్రం రాష్ట్ర వ్యతిరేక కార్యాచరణనే తీసుకుంటున్నారు. భారత్ సమిట్‌కు వివిధ రంగాల నిపుణులనే ఆహ్వానించాం. '

-మిగతా 2 లో..



19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

ప్రతి కుటుంబానికి అమలు

తొలి రాష్ట్రంగా నిలవనున్న తెలంగాణ

ఉప ముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్, కథనం ప్రతినిధి : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించడం ద్వారా దేశంలోనే ఈ విధానాన్ని అమలు చేస్తున్న తొలి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలవబోతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' నమోదు ప్రక్రియను మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబరు 19న సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భట్టి మాట్లాడుతూ... 'కుటుంబానికి అండగా నిలుస్తున్న వ్యక్తి

-మిగతా 2 లో..



భారత్ చొరవతోనే యోగాకు
ప్రపంచ ఆదరణ

ఆయుర్వేదం, సంప్రదాయ వైద్య విధానాలను ప్రోత్సహిస్తున్నాం

దేశాధినేతల కుటుంబ సభ్యులు సైతం యోగాను అభ్యసిస్తున్నారు

'ప్రశాంతి కుటీరం' స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ వెల్లడి

భారతదేశం తీసుకున్న చొరవ ఫలితంగా యోగాకు ప్రపంచవ్యాప్తంగా విశేషమైన ఆదరణ పెరుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఆయుర్వేదం సహా సాంప్రదాయ వైద్య విధానాలను మన దేశం ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు యోగాను ఒక క్రీడగా స్వీకరించాయని, దేశాధినేతల కుటుంబ సభ్యులు సైతం ప్రతిరోజూ యోగాను అభ్యసిస్తున్నారని తెలిపారు. శుక్రవారం కర్ణాటక రాజధాని బెంగళూరులో స్వామి వివేకానంద యోగ అనుసంధాన సంస్థ(ఎస్--వ్యాస) ఆధ్వర్యంలోని యోగ, పరిశోధనా కేంద్రం 'ప్రశాంతి కుటీరం'స్వర్ణోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ఈ సంస్థ ఒక సాధారణ యోగ కేంద్రం స్థాయి నుంచి సేవ, పరిశోధన, విద్య, ఆరోగ్య సంరక్షణకు అంకితమైన ఒక గొప్ప ఉద్యమంగా ఎదిగిందని ప్రశంసించారు. యోగాకు లభించిన అంతర్జాతీయ ఖ్యాతి గురించి ప్రస్తావించారు.

బెంగళూరు, నవంబర్ 13: గత 12 ఏళ్లుగా భారతదేశం తన సాంస్కృతిక వారసత్వాన్ని, సాంప్రదాయ జ్ఞానాన్ని ప్రపంచానికి అందించడం వల్లే ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పాటిస్తున్నారని చెప్పారు. ప్రపంచ దేశాల్లో ఉన్న ప్రజలు భారతదేశాన్ని అర్థం చేసుకోవడానికి యోగ ఒక చక్కటి మార్గంగా మారిందని వ్యాఖ్యానించారు. అనేక దేశాల్లో పాఠశాలలు, సంస్థలు, కార్యాలయాలకు యోగా చేరిందని, సౌదీ అరేబియా దీనిని ఒక క్రీడగా గుర్తించి, ప్రోత్సహించడానికి భారత

-మిగతా 2 లో..

భూములు అమ్మడమే
ప్రభుత్వ పనా?

హెచ్‌ఎండీఏ భూముల వేలం ఆపకపోతే ప్రత్యక్ష పోరాటం

ఎల్‌నినో కంటే ప్రమాదకరంగా కాంగ్రెస్ పాలన : హరీశ్‌రావు

కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలంపై బీఆర్ఎస్ ఆందోళన చేపట్టింది. భూములు అమ్మడమే ప్రభుత్వ పనా?. ఎక్కడ భూమి కనబడినా అమ్ముడేనా?. రేవంత్ ప్రభుత్వ పాలన కాదు.. రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు. రేవంత్ మాటలు చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంచు భూమి కూడా అమ్మమని చెప్పారు. ఇప్పుడు భూములు అమ్మడమే పనిగా పెట్టుకున్నారు. రేవంత్ కన్నుపడితే చాలు.. భూములు అమ్మడమే" అంటూ హరీష్‌రావు దుయ్యబట్టారు.



హైదరాబాద్, కథనం ప్రతినిధి : కాంగ్రెస్ పాలన ఎల్‌నినో కంటే ప్రమాదకరంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హెచ్‌ఎండీఏ ట్రక్ పార్కింగ్ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయడానికి నిర్ణయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

-మిగతా 2 లో..



మానవ వనరుల అభివృద్ధిపై
ఖర్చు పెంచాలి

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల వృద్ధి సాధ్యమే

వయోధికులు పెరిగేలోపే అధిక వృద్ధి సాధించడం కీలకం

తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై సెస్ నివేదిక విడుదల

హైదరాబాద్, కథనం ప్రతినిధి : కొవిడ్ అనంతరం కాలంలో రాష్ట్ర రాబడి తగ్గుతోందని.. దాన్ని పెంచుకోవాలని.. అదే సమయంలో అప్పులపై పరిమితి అవసరమని పలువురు ఆర్థిక నిపుణులు సూచించారు. తలసరి ఆదాయంలో రాష్ట్రం గణనీయమైన వృద్ధిని సాధించిందని ప్రశంసించారు. అభివృద్ధి వ్యయం మాత్రం తగ్గుతోందన్నారు. ఆర్థిక, సామాజిక అధ్యయనాల సంస్థ(సెస్) ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావం నుంచి ఆర్థిక గమనంపై తెలంగాణ ఆర్థిక వ్యవస్థ-ధోరణులు, సవాళ్లు, విధానపరమైన ప్రాధాన్యాలు పేరిట రూపొందించిన సమగ్ర నివేదికను శుక్రవారం సెస్ ఆడిటోరియంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్బీఐ ఛైర్ ప్రొఫెసర్.. దేబ ప్రసాద్ రాత్ మాట్లాడుతూ.. "రాష్ట్ర ప్రభుత్వం 2024 నాటికి ట్రిలియన్

-మిగతా 2 లో..

నగ్న ఫొటోల కోసం
యుద్ధ ప్లాన్ లీక్

పాక్ గూఢచారితో ఐఏఎఫ్ అధికారి బేరం

కీలక సమాచారం లీక్

సంచలన విషయాలు వెలుగులోకి



దేశ రక్షణ రంగంలో కలకలం రేపిన మరో కుట్ర వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ గూఢచారి సంస్థల ఆపరేటింగ్‌లు పన్నిన 'హనీట్రాప్' వలలో భారత వైమానిక దళానికి చెందిన ఒక అధికారి చిక్కుకున్నాడు. సోషల్ మీడియాలో వచ్చిన సుందరాంగుల నగ్న చిత్రాలు, మాయమాటలకు ముగ్ధుడై.. దేశానికి అత్యంత గోప్యంగా ఉండాల్సిన యుద్ధ ప్రణాళికలను శత్రు దేశానికి చేరవేశాడు. ఈ ఉదంతం సంచలనం సృష్టించింది.

న్యూఢిల్లీ, నవంబర్ 13: పాక్ గూఢచారి వలపు వలలో చిక్కుకున్న భారత వాయుసేన అధికారి ఒకరు.. దేశ రహస్యాలను శత్రువుల చేతికి అందజేశారు. ఆ అమ్మాయి నగ్న చిత్రాల కోసం యుద్ధ ప్రణాళికలు, సైనిక మోహరింపు సమాచారాన్ని బేరం పెట్టారు. కొన్ని నెలల క్రితం ఆ అధికారిని అరెస్టు చేసిన దిల్లీ పోలీసులు.. తాజాగా కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే.. భారత వాయుసేనలో వింగ్ కమాండర్ గా పనిచేస్తున్న ఆ అధికారికి.. ఆన్‌లైన్‌లో సదరు గూఢచారితో పరిచయం

-మిగతా 2 లో..

-మిగతా 2 లో..



నేటి చికెన్ ధరలు

పారం ధర లైవ్ బర్డ్	117 (కిలో)
రిటైల్ లైవ్ బర్డ్	144 (కిలో)
డ్రెస్డ్ స్కిన్‌తో	223 (కిలో)
స్కిన్ లెస్	252 (కిలో)

12 గుడ్ల రిటైల్ ధర ₹90

అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం

కంటైనర్ ట్రక్కును ఢీకొట్టిన మినీ బస్సు

26 మంది దుర్మరణం.. 20 మందికి గాయాలు

మృతుల్లో ఎక్కువ మంది కళాశాల విద్యార్థులే



కాజీరంగా, నవంబర్ 13: అస్సాంలోని ప్రఖ్యాత కాజీరంగా నేషనల్ పార్కు సమీపంలో శుక్రవారం ఘోర ప్రమాదం సంభవించింది. మినీ బస్సు, భారీ కంటైనర్ ట్రక్కు పరస్పరం ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది గాయపడ్డారు. మృతుల్లో ఒక మహిళ, 12 ఏళ్ల బాలుడు ఉండగా, మిగిలిన వారిలో చాలా మంది కాలేజీ విద్యార్థులే కావడం గమనార్హం. తరగతులకు హాజరై మినీ బస్సులో తిరిగి వస్తుండగా దురదృష్టవశాత్తూ ప్రమాదంలో మృతి చెందారని పోలీసులు చెప్పారు. జాతీయ రహదారి--175పై కోహోరా రేంజ్‌లోని హత్తీకులీ టీ ఎస్టేట్ సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులతో కూడిన మినీ బస్సు గోలాఘాట్ నుంచి

-మిగతా 2 లో..

ప్రజల సొమ్ముతో
ప్రచారమా..

రాహుల్‌గాంధీకి కేటీఆర్ ప్రశ్న



హైదరాబాద్, కథనం ప్రతినిధి : 'తెలం గాణ ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు మౌనం వహించి... ఇప్పుడు రూ.వంద కోట్ల ప్రజాసొమ్ముతో చేస్తున్న ప్రచార ఆర్భాటానికి వస్తున్నారా?' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో ఈ ప్రచార పర్యటనలు చేయడానికి మీకు అధికారం ఎవరిచ్చారంటూ నిలదీశారు. రాహుల్‌గాంధీ

-మిగతా 2 లో..



భారత్ చొరవతోనే యోగాకు ప్రపంచ ఆదరణ

(మొదటిపేజీ తరువాయి)

ఆయుష్ మంత్రిత్వ శాఖతో ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. విదేశీ ప్రముఖులతో తాను సంభాషించినప్పుడు యోగా తరచుగా ప్రస్తావనకు వచ్చేదని గుర్తుచేసుకున్నారు. తాను ఏ దేశానికి వెళ్లినా భోజన సమయంలో అక్కడి ప్రజలు తనతో యోగా గురించి చర్చిస్తుంటారని చెప్పారు. తమ కుటుంబ సభ్యులు యోగా నేర్చుకుంటున్నారని, సాధన చేస్తున్నారని పలువురు దేశాధినేతలు తనతో చెప్పారని వెల్లడించారు. యోగా పట్ల విదేశీయులకు ఆసక్తి నానాటికీ పెరుగుతోందన్నారు. యోగాలో చేసిన సేవలకు గాను కొందరు విదేశీ అభ్యాసకులకు పద్మశ్రీ పురస్కారం లభించిందని పేర్కొన్నారు. నేడు సమగ్ర ఆరోగ్య సంరక్షణ ఒక ప్రపంచ ఉద్యమంగా మారిందని, దీనివల్ల భారతదేశ ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంపై అందరికీ అవగాహన పెరిగిందని అన్నారు. తమ ప్రభుత్వం మొదటిసారిగా 'ఆయుష్'కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందని, ఆయుర్వేదానికి సంబంధించిన పరిశోధనలను, పేటెంట్లను ప్రోత్సహిస్తోందని వివరించారు. ప్రాచీన జ్ఞానాన్ని ఆధునిక పరిశోధనల్లతో మేళవించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మన సాంప్రదాయ శాస్త్రాల ప్రయోజనాలు ప్రపంచ మానవాళికి చేరేలా చూడాలని పిలుపునిచ్చారు. కన్నడ దిగ్గజ నటుడు దివంగత డాక్టర్ రాజ్‌కుమార్‌ను, కళలు, యోగాకు సేవలందించిన ప్రముఖులను మోదీ గుర్తుచేసుకున్నారు. బెంగళూరు మెట్రో రైలు వ్యవస్థలో భాగంగా రూ.3,470 కోట్ల వ్యయంతో నిర్మించిన పింక్ లైన్‌ను (కలేన అగ్రహార నుంచి తవరకెరె వరకు) ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌తో కలిసి మెట్రో రైలులో ప్రయాణించారు. వారిద్దరూ కౌంటర్ వద్ద విడివిడిగా టికెట్లు కొనుగోలు చేశారు. బెంగళూరులో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మెట్రో రైలు మార్గం, ఫ్లైఓవర్ రెండింటినీ కలిగి ఉండే డబుల్--డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రధానమంత్రికి సీఎం డి.కె.శివకుమార్ వివరించారు. పింక్ లైన్ మొత్తం పొడవు 21.25 కిలోమీటర్లు, ఇందులో 18 స్టేషన్లు ఉన్నాయి. ప్రధానమంత్రి ప్రారంభించిన ఎలివేటెడ్ కారిడార్‌లో ఆరు స్టేషన్లు ఉండగా, భూగర్భంలో 12 స్టేషన్లు ఉంటాయి. ఈ భూగర్భ విభాగం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. యుద్ధం కారణంగా తలెత్తిన ఇంధన సంక్షోభాన్ని భారత్ సమర్థవంతంగా ఎదుర్కోవడానికి గత దశాబ్ద కాలంలో తీసుకున్న చర్యలు ఎంతగానో దోహదపడ్డాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధనం, పెట్రోలియం మౌలిక సదుపాయాలతో సహా కర్ణాటక వ్యాప్తంగా రూ.15,600 కోట్లకు పైగా విలువైన వివిధ ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. ఇరాన్, గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం మన దేశానికి ఇంధన భద్రత ఎంత ముఖ్యమో నిరూపించిందని ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచిందని, ముడి చమురు నిల్వ సౌకర్యాలను అభివృద్ధి చేసిందని, సౌర, జల, పవన విద్యుత్‌ను విస్తరించిందని అన్నారు. రైల్వేలను దాదాపు 100 శాతం విద్యుదీకరించిందని, మెట్రో వంటి ప్రజా రవాణా వ్యవస్థలను బలోపేతం చేసిందని తెలియజేశారు. అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేసిన చామరాజనగర్, చిక్కమగళూరు, సక్లేబపుర, సుబ్రహ్మణ్యరోడ్ రైల్వే స్టేషన్లను సైతం మోదీ ప్రారంభించారు. వందేభారత్ రైలుకు పచ్చజెండా ఊపారు.

19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

(మొదటిపేజీ తరువాయి)

మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో ప్రతి కుటుంబానికి జీవిత బీమా కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రి వర్గం నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా వర్తిస్తుంది. కుటుంబంలో ఒకరు ఉపాధి పొందుతున్నట్లయితే ఆ వ్యక్తికి బీమా వర్తిస్తుంది. పలువురు ఉపాధి పొందుతున్నట్లయితే వారిలో ఎవరికి బీమా కల్పించాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చు. అలాగే ఒకరిని లేదంటే పలువురిని నామినీలుగా ఎంపిక చేసుకునే అవకాశమూ ఉంటుంది. బీమా మొత్తాన్ని నామినీలకు ఏ నిష్పత్తిలో పంపిణీ చేయాలన్నది కూడా కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చు. ఈ నెల 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో ఏకకాలంలో, సంతృప్త స్థాయిలో లబ్ధిదారుల నమోదు ప్రక్రియ చేపట్టాలి. నమోదు కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారనే వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేయాలి. నమోదు చేసిన వివరాలను కుటుంబ సభ్యులకు చదివి వినిపించి, వారి అంగీకారాన్ని నిర్ధారించుకోవాలి. ఈ నెల 17, 18 తేదీల్లో గ్రామాల్లో దండోరా ద్వారా ఈ పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలి. అన్ని రకాల ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలకు ఈ పథకంపై అవగాహన కల్పించాలి' అని అధికారులకు సూచించారు.

అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

నాగావ్ వైపు వెళ్తుండగా, కంటైనర్ ట్రక్కు అప్పర్ అస్సాం వైపు ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గోలాఘాట్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్కొన్నారు. ఇప్పటిదాకా 23 మంది మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారని, మృతుల్లో కొందరిని గుర్తించగా, మిగిలినవారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని తెలియజేశారు. ప్రమాద సమయంలో బస్సులో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారన్నది ఇంకా కచ్చితంగా తెలియరాలేదని, 45 మందికిపైగా ఉండొచ్చని అంచనా వేస్తున్నామని గోలాఘాట్ సీనియర్ ఎస్పీ స్వప్ననీల్ డేకా చెప్పారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే అస్సాం పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి అతుల్ బోరా ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. క్షతగాత్రులను అంబులెన్సుల్లో ఆసుపత్రికి తరలించారు. గాయపడినవారిని కోహోరా ఆసుపత్రిలో చేర్పించారు. తీవ్రంగా గాయపడినవారిని మెరుగైన చికిత్స కోసం బోకాఖత్, గోలాఘాట్, జోర్హాట్ ఆసుపత్రులకు తరలించారు. మినీ బస్సు కాజీరంగా నేషనల్ పార్కు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా అత్యంత వేగంగా దూసుకెళ్తూ కంటైనర్ ట్రక్కును ఢీకొట్టిందని స్థానిక అధికారులు తెలిపారు. డ్రైవర్ తన వాహనంపై నియంత్రణ కోల్పోయాడని, ఈ క్రమంలోనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉదంతంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించనున్నట్లు స్పష్టంచేశారు. మినీ బస్సు ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వాహనంపై గతంలో 12 చలాన్లు నమోదవ్వగా, వాటికి సంబంధించి రూ.38,500 జరిమానా చెల్లించారు. మరో రూ.4,000 జరిమానా చెల్లించాల్సి ఉంది. ఈ వాహనం నాగావ్‌కు చెందిన అంజీర్ అలీ పేరు మీద రిజిస్టరై ఉంది. కాజీరంగలో జరిగిన ప్రమాదం గురించి తెలిసి తాను తీవ్ర ఆవేదనకు గురయ్యానని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఈ దుర్ఘటన తమను కలచివేసిందని ఉద్ఘాటించారు. ఆప్తులను కోల్పోయిన ప్రతి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. అస్సాంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 26 మంది మరణించడం పట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రధానమంత్రి వెల్లడించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో అనూహ్య పరిణామాలు

(మొదటిపేజీ తరువాయి)

సీయింగ్ ఈజ్ బిలీఫ్' అనే విధానంలో భాగంగా ఇక్కడి పరిస్థితులను, పారిశ్రామిక విధానాలను చూపించడం కోసమే భారత్ సమిట్‌ను నిర్వహిస్తున్నాం. దీనిపై కిషన్‌రెడ్డి, రామచందర్‌రావు, కేటీఆర్‌లకు ఎందుకు అభ్యంతరం? మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, ట్రిపుల్ ఆర్, తుమ్మిడిహెట్టి.. ఇలా ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నయినా ముందుకు సాగనివ్వకుండా భాజపా, భారాస నేతలు వ్యతిరేకిస్తున్నారు. కానీ వారు వ్యతిరేకిస్తున్నది కాంగ్రెస్‌ను కాదు.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నారని మరిచిపోతున్నారు..'' అంటూ సీఎం దుయ్యబట్టారు. 'వేల మంది గిగ్‌వర్కర్లకు ఎన్ని సమస్యలున్నాయో అందరికీ తెలుసు. వారిని ఆదుకునే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదు. తెలంగాణలో గిగ్‌వర్కర్ల కోసం రూపొందించిన ప్రత్యేక విధానాన్ని శనివారం ప్రారంభించేందుకు రాహుల్‌గాంధీని ఆహ్వానించాం. భారత్ సమిట్‌లో ముగింపు సందేశం ఇచ్చేందుకు రాహుల్ హైదరాబాద్ వస్తే భాజపాకు సమస్య ఏమిటి? ప్రధాని మోదీ చైనా, పాకిస్థాన్ వెళ్లి ఉపన్యాసాలిస్తారు. కానీ క్యాబినెట్ హోదాలో ఉన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇక్కడికి వస్తే మాత్రం భాజపా నేతలు అభ్యంతరం చెబుతున్నారు. భారత్ సమిట్‌కు హాజరయ్యే 70 దేశాల ప్రతినిధులు తిరిగి వెళ్లేటప్పుడు తెలంగాణ అంబాసిడర్లుగా మారతారు. వారిని ఇక్కడికి పిలిపించి కొన్ని తీర్మానాలు చేయడం ద్వారా తెలంగాణ పెట్టుబడులకు అనుకూలంగా ఉందని చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాం. భారాస, భాజపా నేతల కడుపులో విషమున్నా రాష్ట్రానికి అన్యాయం చేయొద్దు. కొద్ది రోజుల క్రితం దిల్లీలో గ్లోబల్ సమిట్ కర్టెన్‌రైజర్‌కు కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ వస్తే అభ్యంతరం చెప్పని మీరు.. అదే తరహాలో జరుగుతున్న భారత్ సమిట్‌కు రాహుల్‌గాంధీ వస్తుంటే వ్యతిరేకిస్తున్నారు. గ్లోబల్ సమిట్ కర్టెన్‌రైజర్, ఎల్‌నినోపై అఖిలపక్ష చర్చ సందర్భంగా మేం పిలిచినా భాజపా నేతలు రాలేదు. కిషన్‌రెడ్డికి తెలంగాణ ప్రయోజనాలు పట్టడంలేదు. ఆయన గుజరాత్ కోసమే పనిచేస్తున్నారు. మోదీని ఆకట్టుకునేందుకు రాహుల్‌గాంధీని గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారు. రాహుల్ వస్తే నల్లజెండాలు ఎగరవేస్తామంటున్నారు. అలా చేస్తే మీ మొహాలే నల్లగా అవుతాయి. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు కానీ.. కిషన్‌రెడ్డికి మాత్రం ఎంపీ సీటును కేసీఆర్ ఇచ్చారు. భారాస అవయవదానం వల్లే భాజపాకు 8 ఎంపీ సీట్లు దక్కాయి. ప్రపంచంలో మారుతున్న పరిస్థితులపై బహిరంగంగా చర్చిస్తున్న భారత్ సమిట్‌కు అవసరమైతే కిషన్‌రెడ్డి కూడా వచ్చి సలహాలు ఇవ్వొచ్చు. మేం భాజపాను వ్యతిరేకిస్తే దేశాన్ని వ్యతిరేకించినట్లు కాదు. కేంద్ర ప్రభుత్వం కేవలం గుజరాత్ కోసమే పనిచేస్తోందని నేరుగా మేం ఆరోపిస్తున్నాం. గిఫ్ట్‌సిటీని తెలంగాణకు కాకుండా గుజరాత్‌కు ఎందుకిచ్చారు? ఆ విషయాన్ని కిషన్‌రెడ్డి ఎప్పుడైనా ప్రశ్నించారా? రాహుల్‌గాంధీ భాజపాను ఓడించి ప్రధాని అవుతారని మీకు భయం ఉండొచ్చు. ఆ భయంతో చౌకబారు ఆరోపణలు చేయకండి. రాహుల్‌గాంధీని రీలాంచ్ చేయడం కోసమే హైదరాబాద్‌కు ఆహ్వానించారని అనడం సరికాదు. ఆయన 2004 నుంచి రాజకీయాల్లో ఉన్నారు. ప్రస్తుతం ప్రతిపక్షనేత. రేపు ప్రధాని అవుతారు. అలాంటి నేతకు ప్రమోషన్ చేయాల్సిన అవసరమేముంది? రాహుల్‌గాంధీని ప్రమోట్ చేయడం కోసం భారత్ సమిట్ పేరిట ప్రభుత్వ నిధులు వ్యయం చేస్తున్నారని కేటీఆర్ అనడంలో అర్థం లేదు. ప్రభుత్వ సొమ్ము ప్రతి పైసాకు లెక్క ఉంటుంది. కేటీఆర్‌కు విజ్ఞత లేదు. ఆయన ఏం మాట్లాడినా సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎల్‌నినోపై ప్రభుత్వం సరిగా స్పందించలేదంటూ కేటీఆర్ ఆరోపిస్తున్నారు. మేం కేసీఆర్‌లా 80 వేల పుస్తకాలు చదవలేదు. వాతావరణ పరిస్థితులపై అధ్యయనం చేయడంలో నిష్ణాతులం కాదు. అందుకే నిపుణులను భారత్ సమిట్‌కు ఆహ్వానించి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. ఒకవేళ కేటీఆర్ రావాలనుకున్నా.. వచ్చి చర్చించొచ్చు'' అని సీఎం పేర్కొన్నారు.

భూములు అమ్మడమే ప్రభుత్వ పనా?

(మొదటిపేజీ తరువాయి)



ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. వేలం వేయనున్న హెచ్‌ఎండీఏ స్థలాన్ని, అక్కడి ట్రక్ పార్కింగ్, నర్సరీ; ఆర్టీఏ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. హెచ్‌ఎండీఏ స్థలం వేలాన్ని నిలిపి వేయకపోతే ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ట్రక్ పార్కింగ్ స్థలాన్ని వేలం వేయడానికి ప్రయత్నించగా తాను, కృష్ణారావు, సీపీఐ, సీపీఎంతో కలిసి ఉద్యమం చేసి కాపాడామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఇక్కడ స్థలాన్ని ట్రక్ పార్కింగ్, ట్రాఫిక్ ఠాణాలు, నర్సరీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి కేటాయించడం ద్వారా ప్రజాప్రయోజనాలకు పెద్దపీట వేశామన్నారు. మళ్లీ 13 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూముల అమ్మకానికి ప్రయత్నిస్తుండగా సీపీఐ, సీపీఎంతో కలిసి మరోసారి ఉద్యమానికి నడుం బిగించాల్సి వచ్చిందన్నారు. వేలం ఆపాలని.. కాదని నిర్వహిస్తే, ఎవరు కొనుగోలు చేసినా.. వచ్చేది భారాస ప్రభుత్వమని, అధికారంలోకి రాగానే వేలాన్ని రద్దు చేస్తామని పేర్కొన్నారు. "1982కి ముందు అప్పటి హుడా అధికారులు ఇక్కడ రైతుల నుంచి భూములు సేకరించినప్పుడు విడుదల చేసిన ఆర్డర్ కాపీలో.. వీటిని ఎలాంటి నిర్మాణాలు, వాణిజ్య అవసరాలకు వినియోగించబోమన్న విషయం స్పష్టంగా ఉంది. ఈ స్థలాన్ని ప్రజాప్రయోజనాలకే వినియోగించాలి. లేదంటే రైతులకు ఇవ్వాలి. సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి సారించకుండా భూముల చుట్టూ పరిభ్రమిస్తున్నారు. రియల్‌ఎస్టేట్ దందా చేస్తున్నారు. కాప్రాలో 480 గజాలు, అమీన్‌పూర్‌లో 300 గజాల స్థలాలను కూడా అమ్ముకోవడం దుర్మార్గ పాలనకు నిదర్శనం. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భూములు విక్రయిస్తే బొందలకు కూడా చోటులేకుండా చేస్తున్నారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు అధికారంలోకి రాగానే బొందలను కూడా వదలకుండా అమ్ముకుంటున్నారు. మియాపూర్ భూములను గతంలో పదేళ్లు మేము పరిరక్షించాం. ఇప్పుడు వాటిని కూడా అమ్ముకోవడానికి చూస్తున్నారు. ఇప్పటికే రూ.లక్ష కోట్ల భూములను అమ్ముకున్నారు'' అని హరీశ్‌రావు ఆరోపించారు. ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. అప్పట్లో తమ తాత, గ్రామస్థుల నుంచి సేకరించిన ఈ స్థలాన్ని ఎకరా రూ.99 కోట్లకు విక్రయించడానికి ఈ నెల 27న వేలం వేసేందుకు ప్రకటన ఇచ్చారన్నారు. న్యాయస్థానానికి వెళ్లి పోరాటం చేస్తామని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఈ భూములను అమ్ముకోనివ్వమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు కుర్మయ్యగారి నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, రాగిడి లక్ష్మారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం, సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవ వనరుల అభివృద్ధిపై ఖర్చు పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)



డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రణాళికతో ముందుకు సాగితే లక్ష్యం సాధించడం సాధ్యమే. అయితే 2026 నాటికి 60 సంవత్సరాల వయసు పైబడిన వారి శాతం 12.5గా ఉంటుంది. 2047కి 17.1 శాతానికి పెరుగుతుంది. వయోధికుల జనాభా శాతం పెరగకముందే వృద్ధి శాతాన్ని గణనీయంగా పెంచుకోవాలి'' అని సూచించారు. ఆర్బీఐ సలహాదారు సంగీతా దాస్ మాట్లాడుతూ.. "2024-25 లో రాష్ట్రం 79శాతం సొంత ఆదాయాన్ని సాధించింది. హరియాణా తర్వాత రెండో స్థానంలో నిలిచింది. మూలధన వ్యయం తక్కువగా ఉండటం లోపం'' అని అన్నారు. ఇండియా ఫోరమ్ సంపాదకుడు రామ్‌మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. "2014-15లో రూ.18 వేల కోట్లు ఉన్న అప్పు... 2024-25కి పదుల రెట్లు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. జీఎస్‌డీపీలో అప్పులు 34.90 శాతానికి చేరుకున్నాయి. అర్హులైన వారికే రాయితీలు అందాలి. రైతుబంధు పథకంలో పెద్ద సంఖ్యలో అనర్హులైన వారు లబ్ధి పొందారు'' అని వివరించారు. "మానవ వనరుల అభివృద్ధిపై వ్యయం పెంచాలి. విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లో కేటాయింపులు పెరగాలి. గత పదేళ్ల ఆర్థిక పరిస్థితిని గమనిస్తే రాష్ట్రంలో వాటిపై తక్కువ వ్యయం ఉంది. తలసరి ఆదాయంలో కొద్ది సంవత్సరాల క్రితం 8వస్థానంలో ఉండగా...2023-24లో రెండో స్థానానికి చేరుకుంది. బడ్జెట్ వ్యయం, రాయితీలు ఇచ్చిన తర్వాత అంతిమ లబ్ధిదారులకు కలిగిన ప్రభావంపై అధ్యయనం అవసరం'' అని సెస్ డైరెక్టర్ ఆచార్య ఇ.రేవతి అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ విజయకుమార్, ఆర్బీఐ హైదరాబాద్ రీజినల్ డైరెక్టర్ చిన్మోయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుపై విచారణ చేయగలరా?

ముఖ్యమంత్రికి కల్వకుంట్ల కవిత సవాల్



సిద్దిపేట: 'కొండపోచమ్మ సాగర్ టన్నెల్‌ను ఎలాంటి అనుమతులు లేకుండా కాల్వగా మార్చారు. అందువల్ల అదనంగా రూ.1,700 కోట్ల అంచనా వ్యయం పెరిగింది. డబ్బు రికవరీ చేయాలని నివేదిక వచ్చినా ఈ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఈ నెల 19న సిద్దిపేటకు వస్తున్న ముఖ్యమంత్రి ఈ విషయాలపై విచారణకు ఆదేశించగలరా' అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయక్షేత్రం వద్ద తన పేర.. తన కుటుంబ సభ్యుల పేర ఒక్క గజం స్థలమున్నా ప్రభుత్వానికే రాసిస్తానని ప్రకటించారు. సిద్దిపేటలోని రంగధాంపల్లి శివారులో తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి భర్త అనిల్‌తో కలిసి శుక్రవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. "నీళ్ల విషయంలో రైతులకు భారాస నాయకులు అన్యాయం చేశారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, రంగనాయకసాగర్ భూనిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు. అభివృద్ధి పేరిట హరీశ్‌రావే గెస్ట్‌హౌస్‌లు కట్టుకున్నారు. గతంలో మంత్రిగా ఉన్న ఆయన ప్రైవేటు ఆసుపత్రులను బెదిరించారు. నిమ్స్‌లోనూ కొంతమంది ఉద్యోగుల ఈపీఎఫ్‌కు సంబంధించి రూ.100 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని బాధితులే లేఖ రాశారు' అని కవిత వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర, మాజీ మంత్రి బోడ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సొమ్ముతో ప్రచారమా..

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ రాకపై శుక్రవారం కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... పలు ప్రశ్నలు సంధించారు. 'ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం..ఉద్యోగాల కోసం పోరాడుతున్న నిరుద్యోగ విద్యార్థులపై పోలీసులతో దాడులు చేయించినప్పుడు మీరు ఎక్కడున్నారు రాహుల్‌గాంధీ? లగచర్లలో వారి భూముల కోసం పోరాడుతున్న గిరిజన మహిళలను దుస్తులు చింపి అవమానించినప్పుడు, బుల్డోజర్లతో ప్రజల ఇళ్లను 'హైడ్రా' కూల్చివేస్తున్నప్పుడు, కంచ గచ్చిబౌలి హెచ్‌సీయూ భూముల్లో రాత్రికిరాత్రే 10 వేలకు పైగా చెట్లను నరికివేసి, జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేసినప్పుడు.. కేబీఆర్ పార్కును నాశనం చేస్తున్నప్పుడు మీ గొంతు ఎందుకు పెగల్లేదు? 10 మంది భారాస ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్నప్పుడు, మహిళా ప్రజాప్రతినిధులపై అసెంబ్లీ ఎదుటే దాడులు చేసినప్పుడు కనీసం ఒక్క మాటైనా మాట్లాడారా? మీ సొంత పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులే బహిరంగంగా కాంగ్రెస్ అవినీతిపై మాట్లాడుతున్నారు. అయినా మీరెందుకు స్పందించడం లేదు? తెలంగాణ ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం మీకుందా?' అని కేటీఆర్ ప్రశ్నించారు.

నగ్న ఫొటోల కోసం యుద్ధ ప్లాన్ లీక్

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడింది. ఈ ఏడాది జనవరి 12 నుంచి ఏప్రిల్ 1 వరకు వీరు వాట్సప్‌లో సంభాషణలు సాగించారు. దాదాపు 3000లకు పైగా టెక్ట్స్ సందేశాలు, 65 ఫొటోలు పంపించుకున్నారు. వీరి మధ్య 42 వాయిస్ కాల్స్, నాలుగు వీడియో కాల్స్ ఉన్నాయి. ఆరు యూఆర్‌ఎల్స్‌ను కూడా షేర్ చేసుకున్నారు. మన డ్రోన్ సామర్థ్యాలు, సీక్రెట్ డ్రోన్ యూనిట్, సైనిక స్థావరాలు ఉన్న వివరాలు, ఘర్షణలు, ఉద్రిక్తతల వేళ ముందుగా మోహరించే యుద్ధ విమానాలు, సైనిక ప్రాంతాలు వంటి సున్నితమైన సమాచారాన్ని ఆ అధికారి పాక్ గూఢచారితో పంచుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఓసారి ఆ గూఢచారి నగ్న చిత్రాన్ని పంపితే.. సదరు అధికారి సీక్రెట్ వార్ ప్లాన్‌కు సంబంధించిన పేజీని ఆమెకు షేర్ చేసినట్లు పోలీసులు ఛార్జ్‌షీట్‌లో వెల్లడించారు. అంతేకాదు.. ప్రతి నగ్న ఫొటోకు యుద్ధ ప్రణాళికకు సంబంధించిన ఒక కొత్త పేజీని పంపిస్తానని అధికారి చెప్పినట్లు పేర్కొన్నారు. ఇక, పాక్ గూఢచారి పంపించిన ఓ మాల్వేర్ యాప్‌ను తన కింద పనిచేసే సబ్‌ఆర్డినేట్ డివైజ్‌లలోనూ ఇన్‌స్టాల్ చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. లేహ్‌లోని యుద్ధ విమానాల మోహరింపు, సూరత్‌గఢ్‌లోని మహజన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద మిలిటరీ విన్యాసాల గురించిన సమాచారాన్ని కూడా ఐఏఎఫ్ అధికారి షేర్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ అధికారి నిర్వాకం మే నెలలోనే బయటపడింది. ఓసారి ఆఫీసుకు స్మార్ట్‌ఫోన్ తీసుకొచ్చిన అతడిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అప్పుడు అనుమానం వచ్చిన ఎయిర్‌ఫోర్స్ అధికారులు సదరు వింగ్ కమాండర్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో మే 30న దిల్లీ పోలీసులు అతడిని అరెస్టు చేసి తీహాడ్ జైలుకు తరలించారు. అనంతరం దర్యాప్తు చేపట్టి తాజాగా ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

దూరప్రాంత బస్సుల్లో నెలవారీ రూట్‌పాస్‌లపై రాయితీలు

మహిళలకు 15 రోజులు, పురుషులకు 20 రోజుల ఖర్చుతోనే..

నేటి నుంచి అందుబాటులోకి: ఆర్టీసీ

హైదరాబాద్, నవంబర్ 13: ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళల వరకు ఉచిత ప్రయాణం ఉంది. డీలక్స్ బస్సుల్లో మాత్రం మహిళలు, పురుషులు అందరూ టికెట్ తీసుకోవాల్సిందే. తాజాగా ఈ బస్సుల్లో ప్రయాణికులకు కూడా అదనపు రాయితీలు, సదుపాయాలు కల్పించనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. నెలవారీ సీజన్ టికెట్(ఎంఎస్‌టీ)ను మహిళలకు 15 రోజుల ప్రయాణ ఖర్చుతో, పురుషులకు 20 రోజుల ఖర్చుతో జారీ చేయనున్నట్లు తెలిపింది. ఈ రాయితీలను శనివారం నుంచే అమల్లో తెస్తున్నట్లు శుక్రవారం వెల్లడించింది. డీలక్స్, ఈ-డీలక్స్ బస్సుల్లో ప్రయాణించేందుకు వీలుగా కొత్త డీలక్స్ నెల పాస్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించింది. ఎంత దూరమైనా: ఇప్పటివరకు 50 కి.మీ. దూరానికే నెల పాస్‌లు జారీ చేస్తుండగా, ఇకపై ఎంతదూరానికైనా ఇవ్వనుంది. టోల్‌ప్లాజా ఛార్జీలను 25 రోజులకు బదులుగా 20 రోజులకే లెక్కించనుంది. నెలవారీ బస్‌పాస్ ఉన్నవారు హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్ నగరాల్లో ఆదివారాల్లో అన్ని రకాల సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పుష్పక్ ఎయిర్‌పోర్టు లైనర్ బస్సుల్లో మాత్రం ఈ సదుపాయం వర్తించదు. నెల పాస్ ఉన్నవారు అదనంగా రూ.20 చెల్లించి ఇతర కేటగిరీ బస్సుల్లోనూ వెళ్లవచ్చు. పల్లెవెలుగు పాస్ ఉన్న పురుషులు అదనంగా రూ.20 ఇస్తే ఎక్స్‌ప్రెస్, లేదా ఈ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించవచ్చు. ఎక్స్‌ప్రెస్ పాస్‌ఉన్నవారు డీలక్స్, ఈ-డీలక్స్ బస్సుల్లో వెళ్లవచ్చు. పల్లెవెలుగు పాస్‌తో డీలక్స్ బస్సుల్లో ప్రయాణానికి మాత్రం అనుమతి లేదు. రెండు నెలల పాస్ తీసుకుంటే ఐదు రోజులు, మూడు నెలల పాస్ తీసుకుంటే మరో పది రోజులు అదనంగా చెల్లుబాటవుతుంది. నిర్ణీత మార్గం వెలుపల తెలంగాణలో సూపర్ లగ్జరీ, ఆపై తరగతి బస్సుల్లో ప్రయాణిస్తే ప్రాథమికఛార్జీపై 10%రాయితీ లభిస్తుందని ఆర్టీసీ వెల్లడించింది.

కాలం చెల్లిన లేబర్ అడ్డాల స్థానంలో ఆధునిక లేబర్

ఏజెన్సీలు ఏర్పాటు చేయాలి : అనంతయ్య




హైదరాబాద్ 13 నవంబర్ (కథనం): భవన నిర్మాణ రంగంలో కార్మికుల ఉపాధి వ్యవస్థను ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. సంప్రదాయ లేబర్ అడ్డాల స్థానంలో ప్రభుత్వం గుర్తింపు, పర్యవేక్షణతో ఆధునిక లేబర్ ఏజెన్సీలను ఏర్పాటు చేయాలి.ఈ ఏజెన్సీల ద్వారా కార్మికుల వివరాలు నమోదు చేసి, నైపుణ్యాలకు అనుగుణంగా ఉపాధి కల్పించడంతో పాటు న్యాయమైన వేతనాలు, నిర్ణీత పని గంటలు, ప్రమాద బీమా, ఆరోగ్య భద్రత, లేబర్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి.ముఖ్యంగా బహుళ అంతస్తుల నిర్మాణాల్లో పనిచేసే కార్మికులకు హెల్మెట్లు, సేఫ్టీ బెల్టులు, షూస్, గ్లౌజులు, సేఫ్టీ నెట్స్ పారాషూట్ గోవాలను తప్పనిసరిగా అందించాలి. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణ వైద్యం సదుపాయం కోసం ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేసి సత్వరమే చికిత్స అందే విధంగాచర్యలు తీసుకోవాలి. లేబర్ ఏజెన్సీలు కేవలం కార్మికులను సరఫరా చేసే కేంద్రాలుగా కాకుండా వారి హక్కులు, భద్రత, ఉపాధి, కుటుంబ భవిష్యత్తుకు భరోసా కల్పించే వ్యవస్థలుగా పనిచేయాలని ప్రభుత్వం, కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలని బి. అనంతయ్య కోరారు.



ప్రశ్నించే గొంతుక ఏమైపోయింది?

నత్తనడకన బ్రిడ్జి పనులు, గుంతల్లో నరకయాతన

తిరుమలాయపాలెం,నవంబర్13(కథనం): పాలేరు నియోజకవర్గం తిరుమలాయపాలెం మండలంలో రోడ్డు,బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్న నేపథ్యంలో రవాణా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది.బండం పల్లి,హస్నాబాద్,సుబ్లేడు గ్రామాల్లో బ్రిడ్జి పనులు నెమ్మదిగా సాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయంపై ఓ న్యూస్ రిపోర్టర్ ఫొటోలు తీసి పత్రికలో ప్రచురించడంతో స్పందించిన బ్రిడ్జి కాంట్రాక్టర్ హస్నాబాద్ గ్రామ చెరువు వద్ద బ్రిడ్జి పనులు సరిచేసి రవాణాకు అనుకూలంగా మార్చారు.ప్రశ్నించడం వల్లే నత్తనడకన సాగుతున్న పనులు మళ్లీ ప్రారంభమయ్యాయని స్థానికులు చెబుతున్నారు.ఇదే తరహాలో ఖమ్మం జిల్లాలో కాల్వఒడ్డు ఏటి బ్రిడ్జిపై నిర్మిస్తున్న అతిపెద్ద తీగల వంతెన పనులు గత సంవత్సరాల నుంచి నడుస్తూనే ఉన్నాయి.జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా పనుల్లో వేగం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాత బ్రిడ్జి నుంచే వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా బ్రిడ్జి ఎక్కేదిగే చోట భారీ గుంతలు పడి లోతుగా మారడంతో వాహనాలు దెబ్బతింటున్నాయి,విపరీతంగా దుమ్ము లేస్తోంది.ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ఆటోల్లో వెళ్తున్నప్పుడు గుంతల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అయినా ఎవరూ స్పందించడం లేదని,జిల్లాలో ఎంతోమంది మేధావులు,ప్రశ్నించే మీడియా మిత్రులు ఉన్నా పాత బ్రిడ్జికి ఇరువైపులా కాస్త మట్టి పోసి గుంతలు పూడ్చాలని ఎవరూ కోరడం లేదని ఖమ్మం టు కాకరవాయి ఆటో యూనియన్,మాజీ సర్పంచ్ యాతాకుల నాగేశ్వరరావు పేర్కొన్నారు.ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రోడ్డు ఎలా ఉంటే నాకేంటి అనుకుంటే కాంట్రాక్టర్లు లాభాలు చూసుకుని వెళ్లిపోతారని,సమస్యపై ప్రశ్నించడం ప్రతి ఒక్కరి హక్కు అని ఆయన అన్నారు.



బచ్చోడు తండాలో 3 నెలలుగా వెలగని వీధి దీపాలు

చీకట్లోనే గ్రామస్తులు, పట్టించుకోని సర్పంచ్, కార్యదర్శి

తిరుమలాయపాలెం,నవంబర్13(కథనం): మండల పరిధిలోని బచ్చోడు తండాలో గత 3 నెలలుగా వీధి దీపాలు వెలగక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వీధి దీపాలు లేక రాత్రి వేళల్లో గ్రామం మొత్తం చీకటిమయంగా మారుతుందని,పిల్లలు,వృద్ధులు,మహిళలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై పలుమార్లు సర్పంచ్‌కు,పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.ఫిర్యాదు చేసినా మరమ్మతులు చేయించకపోవడంతో చీకట్లోనే రోజులు గడపాల్సి వస్తోందని వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖమ్మం గురుకుల ప్రిన్సిపాల్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు

విద్యారంగంలో విశేష సేవలకు గుర్తింపు : సీఎం చేతుల మీదుగా పురస్కారం

తిరుమలాయపాలెం, నవంబర్ 13(కథనం): విద్యారంగంలో విశేష సేవలు అందించినందుకు ఖమ్మం మైనారిటీ గురుకుల గర్ల్స్-2 ప్రిన్సిపాల్ పొలిమెట్ల సీతా మహాలక్ష్మి రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 13న హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ బంజారా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆమె ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడం, క్రమశిక్షణ, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థినుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా నవంబర్ 11న ఖమ్మం మైనారిటీ గురుకుల గర్ల్స్-2 పాఠశాలలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్దీన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ సీతా మహాలక్ష్మిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కోఆర్డినేటర్ కె. వెంకటరామయ్య, విజిలెన్స్ అధికారులు సీతారాములు, రవూఫ్, ఇతర గురుకులాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు, జమాతే ఇస్లామీ సభ్యులు పాల్గొని అభినందనలు తెలిపారు. విద్యార్థినుల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందడం ఖమ్మం జిల్లాకే గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఆమె మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.





చిన్నగణపురంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం

ముళ్లకంచెలు, పిచ్చిమొక్కల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఏఈ.. ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా

(మెదక్ నవంబర్ 13 కథనం) : మెదక్ జిల్లా, కొల్చారం మండలం, చిన్న గణపురం గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ముళ్లకంచెలు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి ప్రమాదకర పరిస్థితి నెలకొంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కనీస నిర్వహణ లేకపోవడంతో పరిసర ప్రాంతమంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్లకంచెలు, పిచ్చిమొక్కలను తొలగించాలని గ్రామస్తులు పలుమార్లు సంబంధిత విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వంటి కీలకమైన ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగి ఉండటం వల్ల విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టే సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అంతేకాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు కూడా భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉంది. అయితే చిన్న గణపురం గ్రామంలోని పరిస్థితి చూస్తుంటే అధికారుల పర్యవేక్షణ ఏ మేరకు ఉందో అర్థమవుతోందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి చిన్న గణపురం గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న ముళ్లకంచెలు, పిచ్చిమొక్కలను వెంటనే తొలగించి, ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలను శుభ్రం చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- **మృత్యుపాశంగా మారిన చింత చెట్టు కొమ్మలు!**
- **13 రోజులైనా కన్నెత్తి చూడని గుంజలూరు లైన్‌మెన్.. ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?**

చివ్వెంల నవంబర్ 13 (కథనం): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. సూర్యాపేట జిల్లా, చివ్వెంల మండలం, గుంజలూరు గ్రామంలోని ఎస్సీ (మాదిగ) కాలనీకి వెళ్లే ప్రధాన విద్యుత్ తీగల మధ్యలో భారీ చింత చెట్టు కొమ్మలు ప్రమాదకరంగా పెరిగిపోయాయి. గాలి వీచినప్పుడల్లా చెట్టు కొమ్మలు కరెంటు తీగలకు తాకుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ తీవ్రమైన సమస్యపై కాలనీవాసులు ఈ నెల 1వ తేదీనే సంబంధిత గుంజలూరు లైన్‌మెన్ నరేందర్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే, వారం రోజుల్లోగా చెట్టు కొమ్మలను తొలగించి సమస్యను పరిష్కరిస్తానని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. కానీ నేటికి 13 రోజులు గడుస్తున్నా లైన్‌మెన్ కనీసం ఎస్సీ కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాలి దుమారం వస్తే చెట్టు కొమ్మల రాపిడికి విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం పొంచి ఉంది. జనసంచారం ఉండే కాలనీలో తీగలు తెగిపడితే భారీ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇంతటి ప్రమాదకర పరిస్థితిపై ముందస్తుగా సమాచారం ఇచ్చినప్పటికీ, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సూర్యాపేట జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని, తక్షణమే చెట్టు కొమ్మలను తొలగించాలని గుంజలూరు ఎస్సీ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ అధికారుల అలసత్వం వల్ల ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే, దానికి పూర్తి బాధ్యత విద్యుత్ శాఖదేనని వారు హెచ్చరిస్తున్నారు.



ఇందిరమ్మ ఇళ్ల ఎల్-3 జాబితాపై క్షేత్రస్థాయి పరిశీలన

నాలుగు గ్రామాల్లో లబ్ధిదారుల వివరాలు తనిఖీ చేసిన ఎంపీడీవో

తిరుమలాయపాలెం, నవంబర్ 13(కథనం): ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఎల్-3 లబ్ధిదారుల జాబితాపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఇందులో భాగంగా మండల ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ సంబంధిత ఏఈలతో కలిసి బీరోలు, దమ్మాయిగూడెం, బంధంపల్లి, తెట్టెలపాడు గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారుల జాబితాను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. లబ్ధిదారుల వివరాలు, అర్హతలకు సంబంధించిన అంశాలను పరిశీలించి క్షేత్రస్థాయి పరిస్థితులను నమోదు చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పరిశీలన చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ ప్రక్రియలో పారదర్శకత, బాధ్యతాయుత విధానాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



జల్లెపల్లి ఫీడర్ పరిధిలో రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

వినియోగదారులు సహకరించాలి: ఏఈ నరేందర్ రెడ్డి


తిరుమలాయపాలెం,నవంబర్13(కథనం): విద్యుత్ లైన్ నిర్వహణ, మరమ్మతు పనుల నేపథ్యంలో శనివారం జల్లెపల్లి ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తిరుమలాయపాలెం ఆపరేషన్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ గడ్డం నరేందర్ రెడ్డి తెలిపారు.33/11 కేవీ పాతర్లపాడు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ జల్లెపల్లి లైన్‌పై మరమ్మతు పనులతో పాటు లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో శనివారం(14వ తేదీ)ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జల్లెపల్లి ఫీడర్ పరిధిలోని గ్రామాలు,ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వెల్లడించారు.విద్యుత్ వినియోగదారులు ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని,మరమ్మతు పనులు సజావుగా సాగేందుకు సిబ్బందికి సహకరించాలని కోరారు.



రైతు సంఘం 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలి

నల్లగొండ మహాసభలకు భారీగా తరలిరావాలి: సీపీఎం నేతలు

తిరుమలాయపాలెం, నవంబర్ 13(కథనం): నల్లగొండలో ఈ నెల 15 నుంచి 18 వరకు జరగనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, తిరుమలాయపాలెం మండల ఇన్‌చార్జి షేక్ బషీరుద్దీన్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పిండిప్రోలులో శుక్రవారం నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రైతాంగ సమస్యల పరిష్కారం, వ్యవసాయ రంగ పరిరక్షణ, రైతు హక్కుల సాధన కోసం రైతు సంఘాలు నిరంతరం పోరాటం చేస్తున్నాయన్నారు. నల్లగొండ మహాసభలు రైతాంగ ఉద్యమానికి మరింత బలం చేకూరుస్తాయని చెప్పారు. ఈ నెల 15న మధ్యాహ్నం 3 గంటలకు నల్లగొండలోని ఎన్జీ కాలేజీ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అధ్యక్షత వహిస్తారని, మాజీ ఎంపీ బృందా కరత్, ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ధావలే, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూ కృష్ణన్, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ తదితరులు హాజరవుతారని వెల్లడించారు. గిట్టుబాటు ధరలు, పెట్టుబడి సాయం, సాగునీరు, రైతు సంక్షేమం వంటి కీలక అంశాలపై మహాసభల్లో చర్చిస్తారని పేర్కొన్నారు. మండలం నుంచి రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు పప్పుల ప్రసాద్, మాజీ సొసైటీ డైరెక్టర్ చల్లా వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు పప్పుల ఉపేందర్, దొండేటి నిర్మల్ రావు, నాగటి సురేష్, చిన్న ఉపేందర్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- **కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే రూ.5 లక్షల జీవిత బీమా**
- **నవంబర్ 19 నుంచి గ్రామ పంచాయతీలు, పట్టణ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు**

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 13 (కథనం) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (xఖజీవీూ) ప్రారంభానికి జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నవంబర్ 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో కూడా ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ పథకం ద్వారా కుటుంబంలో సంపాదించే వ్యక్తి లేదా కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో ఆ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా ఆర్థిక భరోసా అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తిని కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఆదుకోవడం, వారి జీవన భద్రతకు భరోసా కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పథకం అమలులో భాగంగా నవంబర్ 19వ తేదీ నుంచి ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక శిబిర కేంద్రాన్ని, పట్టణ ప్రాంతాల్లో ప్రతి వార్డుకు ఒక శిబిర కేంద్రాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. శిబిరాల నిర్వహణకు ప్రభుత్వ, సెమీ ప్రభుత్వ భవనాలు, సంస్థలను ప్రాధాన్యతగా ఎంపిక చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో అనువైన శిబిర కేంద్రాలను గుర్తించి, వాటి వివరాలను నవంబర్ 13వ తేదీ ఉదయం లోగా సీపీఓ కార్యాలయానికి సమర్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి సేకరించిన వివరాలను క్రోడీకరించి హైదరాబాద్‌లోని ఆర్థిక గణాంకాల సంచాలకుల కార్యాలయానికి నిర్దిష్ట గడువులోగా పంపించాలని తెలిపారు. పథకం ప్రారంభానికి ముందుగానే సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పథకం లక్ష్యాలు, ప్రయోజనాలు, అమలు విధానంపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించడంతో పాటు ప్రజలకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. అర్హులైన కుటుంబాలందరికీ పథకం వివరాలు చేరేలా చర్యలు తీసుకోవాలని, నవంబర్ 19వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు.



నాగదేవతను పూజిస్తే సర్పదోషాలు తొలగిపోతాయి

కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ జంపన ప్రతాప్

సికింద్రాబాద్ : నాగదేవతను భక్తిశ్రద్ధలతో పూజిస్తే సర్పదోషాలు తొలగిపోయి ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలుగుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ జంపన ప్రతాప్ అన్నారు.నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని న్యూ బోయినపల్లి బాపూజీనగర్‌లోని శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయంలో నిర్వహించిన నాగ ప్రతిమల పూజా కార్యక్రమంలో జంపన ప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. కార్తీక మాసంలో వచ్చే తొలి పండుగ నాగుల చవితి ఎంతో విశిష్టమైనదని అన్నారు. ఈ పవిత్రమైన రోజున నాగదేవతను భక్తితో పూజించడం వల్ల కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సాయి, ఆలయ కమిటీ సభ్యుడు పుట్టి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుల సంక్షేమానికి సీఎంసీ

ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలి

శేరిలింగంపల్లి : నూతనంగా ఏర్పాటైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలోని దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం ప్రభుత్వాన్ని కోరారు. శేరిలింగంపల్లి సమైక్య సంఘం అధ్యక్షుడు మేకల అశోక్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సీఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లకు చెందిన దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు, నాయకులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చెరుకు నాగభూషణం మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ తరహాలో సీఎంసీలోనూ వికలాంగుల కార్య సంకల్పం (వికాసం) విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. దివ్యాంగుల హక్కుల చట్టం–2016 ప్రకారం సీఎంసీ బడ్జెట్‌లో ఐదు శాతం నిధులను వికాసం విభాగానికి కేటాయించి, వాటి ద్వారా దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి, పునరావాస కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని కోరారు.అలాగే, డిసెంబర్ 3న నిర్వహించే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సీఎంసీ పరిధిలోని ప్రతి సర్కిల్‌కు రూ.50 వేల చొప్పున నిధులు కేటాయించి, అన్ని రకాల దివ్యాంగులతో ఘనంగా వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సమావేశంలో పాల్గొన్న వివిధ దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సీఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లు, డివిజన్లు, వార్డుల వారీగా అన్ని రకాల దివ్యాంగులతో పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణతో పాటు వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వ స్థాయిలో నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో కూకట్‌పల్లి అధ్యక్షుడు వెంకట్ స్వామి, జనరల్ సెక్రటరీ చిరంజీవి నాగరాజ్, కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు అశోక్ చారి, ఆర్సీ పురం అధ్యక్షుడు మనోజ్ కుమార్, భరత్ నగర్ జనరల్ సెక్రటరీ వెంకటేష్, రాజు, ఫకీర్ సాబ్, షబ్బీర్, వెంకటేష్, ఆరిఫ్, శ్రీను, సాయిబాబు, ఊర్మిళ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



వినూత్న వ్యర్థ నిర్వహణ విధానానికి శ్రీకారం

- విస్తా హోమ్స్‌లో ఏరోబిన్ వ్యవస్థ ప్రారంభం
- తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన

కాప్రా : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా ఏడో వలయ ఉప కమిషనర్ పి. రవీందర్ సాగర్ ఆధ్వర్యంలో కుషాయిగూడలోని విస్తా హోమ్స్‌లో వినూత్న వ్యర్థ నిర్వహణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆధునిక గ్రామీణ భారతదేశం కోసం నిర్మాణాలు సంస్థ (మారి) సహకారంతో ఆధునిక జీవనానికి వ్యర్థ నిర్వహణలో కొత్త మార్గంగా రూపొందించిన ఏరోబిన్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణలత, మదర్సన్ ట్రస్ట్ ప్రతినిధులు, స్వచ్ఛ భారత్ మిషన్ సమన్వయకర్త ప్రేమలత, మారి సంస్థ ప్రతినిధులు పూర్ణ చంద్రిక, ధనలక్ష్మి, శ్రీకాంత్, వెంకటేష్, యాకన్న, జ్యోతి, విస్తా హోమ్స్ అధ్యక్షురాలు చిత్రలేఖ, ప్రధాన కార్యదర్శి వీరభద్ర, లక్ష్మీనారాయణతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీందర్ సాగర్ మాట్లాడుతూ.. గృహాల నుంచి వెలువడే సేంద్రియ వ్యర్థాలను శాస్త్రీయంగా, పర్యావరణహితంగా నిర్వహించడంలో ఏరోబిన్ వ్యవస్థ కీలకమని వివరించారు. వంటగది వ్యర్థాలు, ఇతర కుళ్లిపోయే వ్యర్థాలను ఈ విధానం ద్వారా ఉపయోగకరమైన సేంద్రియ ఎరువుగా మార్చుకోవచ్చని తెలిపారు. ఇళ్లలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించడం వల్ల చెత్త పరిమాణం తగ్గడంతో పాటు మున్సిపల్ వ్యర్థాల సేకరణ, తరలింపు, పారవేతపై భారం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, సాధ్యమైన చోట ఏరోబిన్ వ్యవస్థను వినియోగించుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పరిసరాల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. ప్రతి కుటుంబం చెత్త వేరు చేయడం, సేంద్రియ ఎరువుల తయారీ, బాధ్యతాయుతమైన వ్యర్థాల నిర్వహణ పద్ధతులను పాటిస్తే నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చగా, కాలుష్యరహితంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. పరిశుభ్రమైన, పచ్చని నగర నిర్మాణంలో భాగంగా ఏరోబిన్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రజలు సహకరించాలని ఉప కమిషనర్ విజ్ఞప్తి చేశారు. సుస్థిర పట్టణాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం, ఆధునిక వ్యర్థ నిర్వహణ పద్ధతులు ఎంత అవసరమో ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

సైబర్ మోసాలపై ఎస్పీ ప్రత్యేక పర్యవేక్షణ

రూ.4.97 లక్షల సైబర్ మోసానికి పోలీసుల చెక్

రూ.1.62 లక్షలు రిఫండ్.. మరో రూ.3.35 లక్షలు బ్యాంకు ఖాతాల్లో హోల్డ్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 13 (కథనం) : సైబర్ మోసానికి గురై రూ.4,97,526 కోల్పోయిన బాధితుడికి జిల్లా పోలీసులు అండగా నిలిచారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ప్రత్యేక పర్యవేక్షణలో జిల్లా సైబర్ క్రైమ్ సెల్ అధికారులు వేగంగా స్పందించి బాధితుడి నగదును సురక్షితం చేశారు. పోలీసుల చొరవతో రూ.1,62,470 బాధితుడి బ్యాంకు ఖాతాలోకి తిరిగి జమ కాగా, మరో రూ.3,35,056ను సంబంధిత బ్యాంకు ఖాతాల్లో నిలిపివేశారు. అశ్వాపురం పరిధిలోని హెవీ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సుశీల్ కుమార్ అనే వ్యక్తి క్రెడిట్ కార్డు నుంచి ఈ నెల 8వ తేదీన సైబర్ నేరగాళ్లు నాలుగు విడతల్లో మొత్తం రూ.4,97,526 నగదును కాజేశారు. ఈ విషయాన్ని గుర్తించిన బాధితుడు వెంటనే అప్రమత్తమై 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందిన వెంటనే జిల్లా సైబర్ క్రైమ్ సెల్ అధికారులు స్పందించి, మోసపూరిత లావాదేవీలను పరిశీలించారు. సంబంధిత బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎస్పీ ఆదేశాల మేరకు నగదు బదిలీలను నిలువరించేందుకు చర్యలు చేపట్టారు. ఫలితంగా రూ.1,62,470ను బాధితుడి ఖాతాలోకి రిఫండ్ చేయించడంతో పాటు, మిగిలిన రూ.3,35,056ను నిందితులకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో హోల్డ్ చేయించారు. దీంతో బాధితుడికి చెందిన మొత్తం రూ.4,97,526 నగదుకు భద్రత లభించింది. ఈ ఘటనపై ఈ నెల 9వ తేదీన అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 162/2026గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 318(4), ఐటీ చట్టంలోని సెక్షన్లు 66(సి), 66(డి) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సైబర్ క్రైమ్



ఇన్‌స్పెక్టర్ కె. నరేష్, ఎస్ఐ ఎస్.కె. జుబేదా, సిబ్బంది డి. వంశీకృష్ణ, బి. శ్రావణ్ కుమార్, వి. రజిత, సుప్రియ సమన్వయంతో పనిచేసి బాధితుడి నగదును సురక్షితం చేయడంలో కీలక పాత్ర పోషించారు.

గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయాలి

సైబర్ మోసాలకు గురైన బాధితులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. ముఖ్యంగా మోసం జరిగిన వెంటనే, గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలువరించడానికి, తిరిగి పొందడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర వ్యక్తిగత ఆర్థిక సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని ప్రజలకు సూచించారు.

మణుగూరు బాలికల వసతి గృహాన్ని

సందర్శించిన హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు

విద్యార్థినులతో కలిసి భోజనం.. సమస్యలు, సౌకర్యాలపై ఆరా

మణుగూరు, నవంబర్ 13 (కథనం) : బాలికల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వసతి సదుపాయాల పరిశీలనలో భాగంగా హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు మణుగూరులోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. హ్యూమన్ రైట్స్ నేషనల్ చైర్మన్ అండ్ ఫౌండర్ బొడ్డపాటి దాసు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాల్వ సుధాకర్ రావు ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ జ్యోతి పూజారి వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఆమె, వారికి అందిస్తున్న ఆహార నాణ్యత, పౌష్టికాహారం, వసతి సౌకర్యాలు, విద్యాబోధన, భద్రతా ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం వసతి గృహ పరిసరాలను పరిశీలిం చి పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, మౌలిక వసతుల పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థినులకు ఉదయం అల్పాహా రం, మధ్యాహ్నం, రాత్రి భోజనం నాణ్యతతో పాటు పౌష్టికా హారం అందిస్తున్నారా అనే విషయాలను పరిశీలించారు. తదుపరి



వసతి గృహ ప్రిన్సిపాల్ అనిత, వార్డెన్, సిబ్బందితో సమావేశమై విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించడం, మెరుగైన విద్యాబోధన, వసతి సదుపాయాల కల్పన, బాలికల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీ జ్యోతి పూజారితో పాటు మేకల జ్యోత్స్న, లావణ్య పాల్గొన్నారు. వసతి గృహ ప్రిన్సిపాల్ అనితతో పాటు సిబ్బంది కవిత, అరుణ, జ్యోతి, జయశ్రీ, విజయకుమారి, సుజాత, స్వప్నిక, దివ్య, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, మెరుగైన వసతి సదుపాయాల కల్పన కోసం హ్యూమన్ రైట్స్ సంస్థ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని ఈ సందర్భంగా ప్రతినిధులు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు
- కుషాయిగూడ ఎస్ఐ నిర్మల వెంకన్న

కాప్రా : తమ ఆరోగ్యాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కుషాయిగూడ సబ్ ఇన్‌స్పెక్టర్ నిర్మల వెంకన్న అన్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ బస్టాండ్ వద్ద పలు ఆలయాల నిర్మాణకర్త, లయన్స్ క్లబ్ సభ్యుడు మంత్రి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు శీతాకాలపు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుషాయిగూడ సబ్ ఇన్‌స్పెక్టర్ నిర్మల వెంకన్నతో పాటు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320–సి జోన్ చైర్‌పర్సన్ లయన్ వడ్లూరు జ్యోతిర్మయి చారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్మల వెంకన్న మాట్లాడుతూ, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు రోడ్లు, వీధులు, కాలనీలను నిరంతరం శుభ్రం చేస్తూ పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాలను సైతం పణంగా పెడుతున్నారని అన్నారు. అందుకే వారిని 'పారిశుద్ధ్య వైద్యులు'గా అభివర్ణించాలని పిలుపునిచ్చారు. పేదల ఆకలి తీర్చడంతో పాటు వారికి ఆర్థిక, సామాజిక సహాయం అందిస్తున్న సేవా



సంస్థల కృషిని అభినందించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320–సి జోన్ చైర్‌పర్సన్ లయన్ జ్యోతిర్మయి చారి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలోనే ఆపేస్తున్న ప్రతిభావంతులైన నిరుపేద విద్యార్థులను గుర్తించి, వారి ఉన్నత విద్యకు సహకరించాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహకుడు లయన్ మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ, గతంలో అనేక ఆలయాల నిర్మాణంతో పాటు నిరుపేదలకు ఉచిత వివాహాలు, అన్నదానం, దుప్పట్లు, చీరల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షుడు లయన్ కలకొండ భిక్షపతి, జిల్లా క్యాబినెట్ కోఆర్డినేటర్ లయన్ మహంకాళి నరసింహ చారి, ప్రభాకర్, పారిశుద్ధ్య విభాగం ఎస్ఎఫ్ఏలు లక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

- పాత హఫీజ్‌పేట్ డివిజన్‌లో ఖాళీ స్థలాల శుభ్రతకు ప్రత్యేక చర్యలు
- పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించేలా సిబ్బందికి ఆదేశాలు

శేరిలింగంపల్లి : మియాపూర్ సర్కిల్ పరిధిలోని పాత హఫీజ్‌పేట్ డివిజన్‌లో ఖాళీ స్థలాలను శుభ్రం చేసేందుకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈ, ఎస్ఎస్, ఎస్ఆర్పీ, ఎస్ఎఫ్ఏల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిస్థాయిలో తొలగించి, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడాలని పారిశుద్ధ్య సిబ్బందికి అధికారులు సూచించారు.



ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా నిరంతరం శుభ్రతా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

రంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్.అలేఖ్య నియామకం

తెలంగాణ హ్యూమన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్‌లో కీలక బాధ్యత..

నియామక పత్రం అందజేసిన చైర్‌పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి



ఉప్పల్ : తెలంగాణ హ్యూ మన్ రైట్స్ జస్టిస్ ఫోరమ్ రంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్. అలేఖ్య నియమితులయ్యారు. ఈ మేరకు హబ్సిగూడలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఫోరమ్ చైర్‌పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.అలేఖ్య మాట్లాడుతూ, తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ వ్యాసభట్ శ్రీవాణికి, తన నియామ కానికి కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణ దేవరకొండ (సతీష్)కు కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అలేఖ్య పేర్కొన్నారు. హక్కులు కోల్పోయిన బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా నిరంతరం పనిచేస్తానని తెలిపారు. సంస్థ అభివృద్ధికి బాధ్యతాయుతంగా కృషి చేయడంతో పాటు, ఎక్కడైనా మానవ హక్కులకు భంగం కలిగితే ఫోరమ్ తరఫున స్పందిస్తానని స్పష్టం చేశారు. ఈ నియామకం తనపై సామాజిక బాధ్యతను మరింత పెంచిందని అలేఖ్య అన్నారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు, స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు నూతనంగా నియమితులైన ఎస్. అలేఖ్యకు శుభాకాంక్షలు తెలిపారు.



ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

జవహర్ నగర్ : విద్యార్థుల ఉత్సాహభరిత సందడితో జవహర్ నగర్‌లోని జేఎన్‌పీహెచ్ఎస్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొని తమలోని ప్రతిభను చాటుకున్నారు. దీంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది.భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మురళీధర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, వారి ప్రతిభను గుర్తించి సరైన దిశలో ప్రోత్సహించినప్పుడే సమాజానికి మంచి పౌరులు లభిస్తారని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు వారిలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని పేర్కొన్నారు. చదువులోనే కాకుండా క్రీడలు, కళలు, ఇతర రంగాల్లోనూ రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వేడుకలు విద్యార్థులకు మధురానుభూతిని మిగిల్చాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆర్థిక వనరుల నిర్వహణపై

అవగాహన ఎంతో అవసరం

మేడ్చల్ జిల్లా విద్యా శాఖ ఏఎంఓ వేణు

మేడ్చల్: ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, పొదుపు కార్యక్రమాలపై నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమని విద్యా శాఖ ఏ.ఎం.ఓ డి. వేణు అన్నారు. 'ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్' కార్యక్రమంలో భాగంగా, స్వతఃఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ సౌజన్యంతో 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు ఆర్థిక సాక్షరత అందించడం, సామాజిక శాస్త్రం, గణిత ఉపాధ్యాయులతో 'మనీ మ్యాటర్స్' పై జిల్లా కలెక్టరేట్ లోని విద్యా శాఖ కార్యాలయంలో శుక్రవారం నవంబర్ 13న ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఏ.ఏం.ఓ డి.వేణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక అంశాలపై నిర్ణయం తీసుకునే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం 21వ శతాబ్దపు అత్యంత ముఖ్యమైన నైపుణ్య విషయమన్నారు. ఇందులో ముఖ్యంగా, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 6, 7, 8 అలాగే 9వ తరగతుల విద్యార్థులకు ఆర్థిక ప్రణాళికపై సరైన జ్ఞానం, నైపుణ్యం అందించడానికి 'స్వతఃసంస్థ చేస్తున్న కృషిని అభినంది చారు. ఈ సమావేశంలో యశస్విని, యువరాజ్, కావ్య తదితరులు పాల్గొన్నారు.




సీతాఫలమండిలో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలి

మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ

సికింద్రాబాద్ : సీతాఫలమండి డివిజన్ పరిధిలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు, పాడైపోయిన హ్యాండ్ బోర్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ సంబంధిత అధికారులను కోరారు.డివిజన్ పరిధిలోని డీబీఆర్ క్లాత్ స్టార్ ఎదురుగా ఉన్న గల్లీలో స్థానికుల ఫిర్యాదు మేరకు ఆమె పర్యటించి, అక్కడి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు గల్లీలో పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ చెత్తను తొలగించడం లేదని, దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని ఆమెకు వివరించారు. అదేవిధంగా హ్యాండ్ బోర్ పాడైపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.స్థానికుల సమస్యలపై తక్షణమే స్పందించిన డా. సామల హేమ సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పాడైపోయిన హ్యాండ్ బోర్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

ఫోన్లను ఈ ప్రదేశంలో ఉంచడం చాలా ప్రమాదకరం..!

స్మార్ట్ ఫోన్లు అనేవి ప్రస్తుతం మన నిత్య జీవితంలో భాగం అయిపోయాయి. ఇంకా చెప్పాలంటే అవి మన నిత్యావసర వస్తువుగా మారాయి. ఫోన్లు లేకపోతే ఈ ప్రపంచాన్ని అసలు ఊహించుకోలేం అన్నంతగా పరిస్థితి మారింది. చాలా పనులను మనం ఫోన్లతో చక్కబెట్టుకుంటున్నాం. ఇప్పుడు 5జి అందుబాటులో ఉండడంతో చాలా వేగంగా అనేక పనులను చేసుకోగలుగుతున్నాం. అయితే అంతా బాగానే ఉంది కానీ ఫోన్లను వాడడంలోనే అసలు సమస్యంతా ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫోన్లను ఎక్కడ పడితే అక్కడ పెట్టి ఉపయోగించకూడదని వారు హెచ్చరిస్తున్నారు. ఫోన్లను చాలా మంది అసలు ఏయే ప్రదేశాల్లో పెడుతుంటారు.. ఎలా వాడుతుంటారు.. వాటి వల్ల మనకు ఎలాంటి హాని కలుగుతుంది.. అన్న వివరాలను వైద్యులు తెలియజేస్తున్నారు.



చార్జర్‌పై పెట్టడం..

చాలా మంది ఫోన్లను చార్జింగ్ పెట్టి వాటిని కింద పెట్టేందుకు టేబుల్, స్టూల్ లాంటిది ఏదీ లేదని చెప్పి వాటిని చార్జర్‌పైనే పెడతారు. కానీ ఇలా చేయరాదు. దీని వల్ల రేడియేషన్ బాగా వస్తుందని వైద్యులు అంటున్నారు. కనుక ఫోన్లను చార్జింగ్ పెట్టినప్పుడు వాటిని చార్జర్లపై ఉంచరాదు. అలాగే ఓవర్ నైట్ చార్జింగ్ కూడా ఫోన్లను పెట్టరాదు. దాని వల్ల ఫోన్లు పేలిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే చాలా మంది దిండు కింద ఫోన్లను పెట్టి నిద్రిస్తారు. ఇలా చేయకూడదు. ఇలా చేస్తే శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. పలు అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా చర్మ



సమస్యలు వస్తాయి. కనుక నిద్రించేటప్పుడు ఫోన్లను దిండ్ల కింద అస్సలు పెట్టరాదు.

జేబుల్లో ఉంచడం..

అమ్మాయిలకు ఎక్కువగా ఫోన్లను వెనుక జేబులో పెట్టుకునే అలవాటు ఉంటుంది. కానీ ఇలా చేయడం వల్ల ఫోన్ నుంచి వచ్చే రేడియేషన్ కడుపు నొప్పి, కాళ్ల నొప్పిని కలిగిస్తుంది. కనుక ఫోన్లను బ్యాక్ పాకెట్లలో పెట్టరాదు. అలాగే పురుషులు ఎక్కువగా ఫోన్లను ప్యాంటు ముందు జేబులో పెడతారు. ఇలా చేస్తే ఫోన్ల నుంచి వచ్చే రేడియేషన్ వల్ల వీర్య కణాలు నాశనం అవుతాయి. దీంతో సంతానం కలిగేందుకు అవకాశం తక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అలాగే చాలా మంది నిద్రించేటప్పుడు తల పక్కన ఫోన్లను పెట్టి పడుకుంటారు. ఇలా చేయడం వల్ల ఫోన్ నుంచి విపరీతమైన రేడియేషన్ వస్తుంది. ఇది మెదడుపై ప్రభావం చూపిస్తుంది. దీని వల్ల మెదడులో కణతులు ఏర్పడే అవకాశం ఉంటుంది. అది బ్రెయిన్ ట్యూమర్‌కు దారి తీయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

చార్జింగ్ పెట్టినప్పుడు..

ఇక చాలా మంది ఫోన్‌ను చార్జింగ్ పెట్టినా కూడా ఏదైనా కాల్ లేదా మెసేజ్ వస్తే చార్జింగ్ అలాగే ఉంచి దాన్ని ఉపయోగించుకుంటారు. ఇలా కూడా చేయకూడదు. ఇది అత్యంత ప్రమాదకరం. దీని వల్ల ఫోన్ అధికంగా రేడియేషన్, హీట్‌కు గురై త్వరగా పేలిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే ఫోన్లకు కంపెనీలు ఇచ్చిన చార్జర్‌లనే ఎల్లప్పుడూ ఉపయోగించాలి. అలా కుదరకపోతే ఫోన్‌కు ఉన్న చార్జింగ్ కెపాసిటీకి సరిపోయే చార్జర్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. అలాగే ఫోన్‌ను చార్జింగ్ చేసిన అనంతరం కచ్చితంగా చార్జర్ ఉన్న స్విచ్ ను ఆఫ్ చేయాలి. ఈ విధంగా పలు సూచనలు పాటిస్తే ఫోన్లను జాగ్రత్తగా ఉపయోగించుకోవచ్చు. సురక్షితంగా ఉండవచ్చు.



బావిలో పడి మూడేళ్ల చిన్నారి మృతి



ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్థానిక నవజ్యోతి పాఠశాల సమీపంలో నివాసముంటున్న ఓ కుటుంబానికి చెందిన అమ్ములు (3) అనే చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిపోయింది. గమనించిన స్థానికులు చిన్నారిని బయటకు తీసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే మృతి చెందింది. చిన్నారి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ముస్తాబాద్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఎల్లమ్మ ఆలయంలో భక్తుల సందడి

పెద్దపల్లి : నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని స్థానిక శ్రీ ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో కొలువుదీరిన నాగదేవతకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.నాగుల చవితి సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయానికి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. సంప్రదాయబద్ధంగా పూజా సామగ్రిని సిద్ధం చేసుకుని నాగదేవతను దర్శించుకున్నారు.అనంతరం నాగదేవతకు పూలు, పాలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, పిల్లాపాపలతో చల్లగా జీవించాలని నాగదేవతను భక్తితో ప్రార్థించారు.ముఖ్యంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. నాగదేవతకు పాలు పోసి, పూలతో అలంకరించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని నాగదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.నాగుల చవితి పండుగకు హిందూ సంప్రదాయంలో ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. నాగదేవతను ఆరాధించడం ద్వారా కుటుంబానికి శుభం కలుగుతుందని,సంతానం ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతుందని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా నాగుల చవితి రోజున మహిళలు ప్రత్యేకంగా నాగదేవతకు పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.ఈ క్రమంలో పెద్దపల్లి పట్టణంలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో ఉదయం నుంచే భక్తుల రాకతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నాగదేవత నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. భక్తులంతా ఎంతో భక్తిపారవశ్యంతో నాగదేవతను దర్శించుకుని పూజలు నిర్వహించడంతో నాగుల చవితి వేడుకలు భక్తిమయంగా కొనసాగాయి.

ఆటో కార్మికులకు ఆటోనగర్ కాలనీలు

- ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పథకం కింద నిర్మాణం
- క్యూర్ ఏరియాలో 4 చోట్ల, 2 వేల ఇండ్ల సముదాయాల నిర్మాణం
- రూ.220 కోట్లతో నిర్మాణం



మేడ్చల్: ఆటో–రిక్షా కార్మికుల సొంత ఇంటి కలను సాకారం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో బాగంగా, ఆటో కార్మికుల కోసం ప్రత్యేకంగా, ఇందిరమ్మ ఇళ్ల గృహ నిర్మాణ పథకం కింద ఆటో నగర్ కాలనీల నిర్మాణానికి అనుమతీస్తూ, ఈ నెల 13న జీవో.ఆర్.టీ.నెం.592 ను జారీ చేసింది. దీని ప్రకారం క్యూర్ ఏరియాలో నాలుగు చోట్ల ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద, రవాణ, రోడ్లు, భవనాలు (హౌసింగ్) శాఖ ఆధ్వర్యంలో ఆటోనగర్ నగర్ భవన సముదాయాలను నిర్మించనుంది.

ప్రతిపాదన: తెలంగాణ రాష్ట్రంలోని ఆటో–రిక్షా కార్మికులకు సొంత ఇల్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారి సంక్షేమం కోసం, ప్రత్యేకంగా సరసమైన ధరలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం “ఆటో నగర్ కాలనీ” పేర ప్రత్యేకంగా పథకాన్ని ప్రారంభించాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం పై ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్ని ఇండ్లు, ఎక్కడ.. ?

మొత్తం 2,000 ఈ.డబ్ల్యూ.ఎస్ (ఆర్థికంగా వెనుకబడిన వర్గాల) ఫ్లాట్లు
ఈ పథకం కింద మొత్తం 2000 ఇళ్లను నిర్మించడానికి అనుమతి ఇచ్చింది. ఈ ఫ్లాట్లు 4 ప్రాంతాల్లో, ఒక్కో ప్రాంతంలో 500 చొప్పున నిర్మిస్తారు. వాటి వివరాలు ఇలా:
1. బండ్లగూడ (ఎల్.ఐ.జీ కాలనీ) – 500 ఫ్లాట్లు,
2. గండంగూడ – 500 ఫ్లాట్లు,
3. పేట్ బషీరాబాద్ – 500 ఫ్లాట్లు,
4. జల్పల్లి, లక్ష్మీగూడ – 500 ఫ్లాట్లు నిర్మించనున్నారు. రూ. 220 కోట్ల ప్రాజెక్ట్ ఖర్చు ఈ ప్రాజెక్ట్ కోసం సుమారుగా రూ. 220 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.
5. ఎవరు అర్హులు?

ఈ పథకం కేవలం ఆటో–రిక్షా కార్మికుల కోసం మాత్రమే ఉద్దేశించింది. లబ్ధిదారుడు తప్పనిసరిగా ఆటో–రిక్షా కార్మికుడై ఉండాలి.

ఏ నిబంధనలు వర్తిస్తాయి

ఈ పథకానికి ఇందిరమ్మ ఇండ్లు – టవర్స్ పథకం నిబంధనలే వర్తిస్తాయి. అనగా, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పథకం అర్హత ప్రమాణాలే వర్తిస్తాయి.
- ఆర్థిక సహాయం అదే విధంగా ఉంటుంది.
- రిజర్వేషన్ విధానం అదే విధంగా ఉంటుంది.
- ఎంపిక, కేటాయింపు విధానం అదే విధంగా ఉంటుంది.

తదుపరి చర్యలు : తెలంగాణ హౌసింగ్ బోర్డు వారు భూమి లభ్యతను పరిశీలిస్తారు. అలాగే, స్థలం అనుకూలతను పరిశీలిస్తారు. సాంకేతిక సాధ్యతను, ఆ తరువాత వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) ను ప్రభుత్వానికి సమర్పిస్తారు.
అమలు: ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయి.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు



ఆటో నగర్ కాలనీ పేరు పెట్టినందుకు ధన్యవాదములు. జీ.వో.నెంబర్: 592 ఇచ్చిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదములు. ప్రభుత్వం మొదటి సారి ఆటో డ్రైవర్ల సంక్షేమం గురించి ఆలోచించి నందుకు కృతజ్ఞతలు. ఏ ప్రభుత్వం ఈ విధంగా ఆలోచన చేయలేదు. ఆటో కార్మికుల చిరకాల కోరిక నెరవేరింది. తెలంగాణాలోని అర్హులైన ఆటో డ్రైవర్ల అందరికి ఇల్లు ఇవ్వాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ సమాఖ్య ప్రెసిడెంట్ ఏ. సత్తి రెడ్డి కోరుతున్నాను.

- ఏ.సత్తి రెడ్డి, తెలంగాణ ఆటో డ్రైవర్స్ సమాఖ్య ప్రెసిడెంట్:



న్యాయ సేవాధికార సంస్థ న్యాయ విజ్ఞాన సదస్సు

మేడ్చల్ : తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయ మూర్తి వి. బాలభాస్కర్ రావు ఆదేశాల మేరకు, మిస్ జి.ఎస్.ల్. ప్రియాంక, సెక్రటరీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మేడ్చల్ – మల్కాజిరి బాలల దినోత్సవ సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును కుషాయిగూడలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల 13న నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యా హక్కుల చట్టం, బాల్య వివాహాల చట్టం, లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం 2012, బాలకార్మిక చట్టం మాదక ద్రవ్యాల గురించి, వాటి వళ్ళ కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, స్కూల్ సిబ్బంది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సంక్షేమమే సమాజ అభివృద్ధికి నాంది

- చిన్నారులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు
- ఎంపీపీఎస్ ఆర్కేపురం ఎస్జీటీ సయ్యద్ రూహి

సికింద్రాబాద్ : దేశ భవిష్యత్తు నేటి బాలల చేతుల్లోనే ఉందని, ప్రతి చిన్నారికి విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని అలవర్చడం ఎంతో ముఖ్యమని ఎంపీపీఎస్ ఆర్కేపురం ఎస్జీటీ సయ్యద్ రూహి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులందరికీ ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల హక్కులను కాపాడటం, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించడం మనందరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.



చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.నేటి చిన్నారులే రేపటి బాధ్యతగల పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. బాలల సంక్షేమం, విద్య, ఆరోగ్యం, భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సయ్యద్ రూహి పిలుపునిచ్చారు.



ఒకేచోట.. సర్కారు కొలువు!

- రూ.25 కోట్లతో దేవరకొండలో సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం
- ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యం
- స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే బాలు నాయక్

దేవరకొండ : ప్రభుత్వ కార్యాలయా ల చుట్టూ తిరిగే ప్రజల కష్టాలకు తెరదించడంతో పాటు, అన్ని ప్రభుత్వ శాఖల సేవలను ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో దేవరకొండ లో సమీకృత ప్రభుత్వ కార్యాల యాల సముదాయం నిర్మాణానికి కార్యాచరణ మొదలైం ది. ఇందుకోసం సుమారు రూ.25కోట్ల నిధులతో చేపట్టనున్న ఇంటిగ్రే టెడ్ ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణానికి సంబం ధించి శుక్రవారం ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ క్షేత్రస్థాయి–ులో స్థల పరిశీలన నిర్వహించారు.పట్టణంలోని 18వ వార్డు పరిధిలో, పోలీస్ స్టేషన్ సమీపాన ఉన్న ఆర్అండ్బీ గెస్ట్హౌస్ పక్కన ప్రతిపాదిత స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. దేవరకొండ ఆర్డీవో, తహసీల్దార్తో పాటు సంబంధిత శాఖల అధికారులతో కలిసి స్థల పరిస్థితులను సమీక్షించారు. భవన నిర్మాణానికి స్థలం ఎంతవరకు అనుకూలంగా ఉంది? అవసరమైన మౌలిక వసతులు ఎలా ఉన్నాయి? ప్రజలు సులభంగా చేరుకునేందుకు రవాణా సౌకర్యాలు ఎలా ఉంటాయి? అనే అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఒకే ప్రాంగణంలో.. అన్ని సేవలు!

ప్రస్తుతం వివిధ ప్రభుత్వ పనుల నిమిత్తం ప్రజలు ఒక్కో శాఖ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. ఒక కార్యాల యం నుంచి మరో కార్యాలయానికి తిరగడం వల్ల సమయం, ప్రయాణ ఖర్చులు వృథా అవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఒకే రోజు తమ పనులన్నీ పూర్తి చేసుకోవడం ఇబ్బందిగా మారుతోంది. ఈ నేపథ్యంలో సమీకృత ప్రభుత్వ కార్యాల యాల సముదాయం అందుబాటులోకి వస్తే వివిధ శాఖల సేవలు ఒకే ప్రాంగణంలో పొందే అవకాశం కలుగుతుంది. ప్రజలకు పరిపాలన మరింత చేరువ కావడంతో పాటు ప్రభుత్వ సేవల్లో వేగం పెరిగే అవకాశం ఉంటుంది.

నిర్మాణ ప్రక్రియ వేగవంతం చేయాలి

ప్రజలకు మెరుగైన పరిపాలన, సత్వర ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే బాలు నాయక్ పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల సముదాయం నిర్మాణం పూర్తయితే దేవరకొండ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. నిర్మాణానికి సంబంధించి అవసరమైన తదుపరి చర్యలను వేగవంతం చేయాలని, స్థల పరిశీలన అనంతరం చేపట్టాల్సిన ప్రక్రియపై అధికా రులు సమగ్రంగా దృష్టి సారించాలని సూచించారు. దేవరకొండ పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే వేదికపైకి వస్తే పరిపాలనా సౌలభ్యం పెరగడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వీలవుతుం దని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ పున్న వెంకటేశ్వర్లు, ఆలంపల్లి నర్సింహా, హనుమంతు వెంకటేష్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ రయీస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, వడ్త్యా దేవేందర్ నాయక్, లోకసాని శ్రీధర్ రెడ్డి, వై.ఎస్. కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

విశ్వాసానికి గౌరవం, ప్రకృతికి రక్షణ

ఉద్వాసనతో మంచి దారి చూపిన హైదరాబాద్

ఇంట్లో సంవత్సరాలుగా ఉన్న దేవుడి పాత ఫోటోలు, చిరిగిపోయిన క్యాలెండర్లు, విరిగిపోయిన విగ్రహాలు, ఉపయోగంలో లేని పూజా పాత్రలు, వీటిని ఏం చేయాలి? భక్తి భావన అడ్డొస్తుంది. చెత్తబుట్టలో వేయలేం. చివరకు చెట్ల కింద, ఆలయాల ప్రహరీల వద్ద, చెరువులు, కాలువల్లో వదిలేయడం జరుగుతోంది. భక్తితో చేసే ఈ పని తెలియకుండానే పర్యావరణానికి భారంగా మారుతోంది.

ఈ సమస్యను గుర్తించి హైదరాబాద్లో జీహెచ్ఎంసీ చేపట్టిన ప్రాజెక్ట్ ఉద్వాసన Respect Faith, Protect Nature నిజంగా అభినందించాల్సిన వినూత్న కార్యక్రమం. పాత విగ్రహాలు, మతపరమైన ఫోటోలు, క్యాలెండర్లు, ఇతర పవిత్ర వస్తువులను నిర్ణీత కేంద్రాల్లో సేకరించి, సంప్రదాయాలకు గౌరవం కల్పిస్తూ శాస్త్రీయంగా నిర్వహించాలన్న ఆలోచన ఆదర్శప్రాయం.

నవంబర్ 14న ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు నగరంలోని ఆరు జోన్ల పరిధిలో 12 దేవాలయాలను సేకరణ కేంద్రాలుగా ఏర్పాటు చేయడం పౌరులకు మంచి అవకాశం. ముఖ్యంగా భక్తి భావనకు భంగం కలగకుండా, పవిత్ర వస్తువులను గౌరవప్రదంగా అప్పగించే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. ఇది కేవలం చెత్త సేకరణ కార్యక్రమం కాదు. విశ్వాసాన్ని అవమానించకుండా పర్యావరణాన్ని కాపాడే పౌర సంస్కృతి. ఇలాంటి కార్యక్రమాలు ఒక్కరోజు కార్యక్రమాలుగా ముగియకూడదు. ప్రతి సంవత్సరం లేదా నిర్ణీత వ్యవధిలో నిర్వహిస్తే ప్రజలకు కూడా ఒక సరైన వ్యవస్థ ఏర్పడుతుంది. ఆలయాలు, కాలనీలు, అపార్ట్మెంట్ సంఘాలు, గేటెడ్ కమ్యూనిటీలు ఇందులో భాగస్వాములు కావాలి. పవిత్రత అంటే కేవలం పూజ చేయడమే కాదు, ప్రకృతిని కలుషితం చేయకుండా కాపాడటం కూడా ధర్మమే. ఇక్కడితో ఈ ఆలోచన



ఆగకూడదు. ఇప్పుడు నగరం వస్త్ర వ్యర్థాల సమస్యపై కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి. మన ఇళ్లలో పేరుకుపోయే పాత బట్టలు, పిల్లలకు చిన్నవైన దుస్తులు, దుప్పట్లు, బెడ్షీట్లు, చెప్పులు, షూలు, వీటిలో చాలా ఇంకా ఉపయోగించదగినవే. మనకు అవసరం లేనిది మరొకరికి అవసరమైనది కావచ్చు. అయినప్పటికీ వాటిలో చాలావరకు చెత్తకుండీల్లోకి లేదా డంప్యార్డులకు వెళ్తున్నాయి.

అందుకే జీహెచ్ఎంసీ ప్రతి నెలా ఒక నిర్ణీత రోజును వస్త్ర సేకరణ దినం గా ప్రకటించాలి. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు ప్రభుత్వ పాఠశాలలు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, నిరుపేద కుటుంబాలతో అనుసంధానం కావాలి. ఉపయోగించదగిన వస్త్రాలను శుభ్రపరచి, గౌరవప్రదంగా అవసరమైన వారికి అందించాలి. పనికిరానివి శాస్త్రీయ రీసైక్లింగ్కు పంపాలి. దేవుడి చిత్రానికి గౌరవం ఇచ్చినట్లే, మనిషి అవసరానికి కూడా గౌరవం ఇవ్వాలి. పాత ఫోటోను చెరువులో వేయకుండా సేకరణ కేంద్రానికి ఇచ్చినట్లే, పాత బట్టను చెత్తకుండీలో వేయకుండా అవసరమైన చేతికి అందించాలి.

ఎందుకంటే మానవ సేవే మాధవ సేవ. దేవుడిని పూలతో పూజించడం ఎంత పవిత్రమో, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, చలిలో ఉన్నవారికి దుప్పటి ఇవ్వడం, అవసరంలో ఉన్నవారికి దుస్తులు అందించడం కూడా అంతే గొప్ప పూజ. మనకు పనికిరాని ఒక దుస్తి ఎవరికో ఆత్మగౌరవాన్ని ఇవ్వవచ్చు. ఒక దుప్పటి ఎవరికో చలి నుంచి రక్షణ కావచ్చు. ఒక జత చెప్పులు ఎవరికో జీవిత ప్రయాణంలో తోడవవచ్చు. ఉద్వాసన జీహెచ్ఎంసీ ఒక మంచి దారి చూపింది. ఇప్పుడు ఆ దారిని విశ్వాసం నుంచి పర్యావరణం వరకు, పర్యావరణం నుంచి మానవత వరకు విస్తరించాల్సిన సమయం వచ్చింది. విశ్వాసాన్ని గౌరవిద్దాం, ప్రకృతిని కాపాడుదాం, అవసరంలో ఉన్న మనిషికి చేయూతనిద్దాం. ఎందుకంటే, మానవ సేవే మాధవ సేవ.



– కొలను వెంకటేశ్వర రెడ్డి
ఎస్పీ రిటైర్డ్, తెలంగాణ జైల్స్

అప్పుల ఊబిలో పడి మహిళ హత్య

స్టాక్ మార్కెట్లో భారీగా సంపాదించాలనే ఆశతో పెట్టుబడులు పెట్టాడు. వరుస నష్టాలతో అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. అప్పుల నుంచి బయటపడేందుకు పక్కింటి మహిళ బంగారు నగలపై కన్నేశాడు. చోరీకి ప్రయత్నిస్తున్న సమయంలో ఆమె తనను గుర్తుపట్టడంతో హత్యకు పాల్పడ్డాడు. హైదరాబాద్లోని మీర్పేట్లో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.



తమిళనాడులోని కాంచీపురానికి చెందిన అరుణ్కుమార్ కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ మిధానిలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భార్య అనిత (34), ఇద్దరు పిల్లలతో కలిసి జిల్లెలగూడ సమీపంలోని ధాతునగర్ శ్రీలక్ష్మి అపార్ట్మెంట్లో నివసిస్తున్నారు. అదే భవనంలోని నాలుగో అంతస్తులో గద్ద రాజ్కుమార్ (41) నివాసముంటున్నాడు. గతంలో ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేసిన అతడు స్టాక్ మార్కెట్ పెట్టుబడుల్లో సుమారు రూ.4 కోట్ల నష్టాలు చవిచూసినట్లు పోలీసులు వెల్లడించారు.

పెట్టుబడుల కోసం పలువురి నుంచి అప్పులు తీసుకున్న రాజ్కుమార్కు వాటిని తిరిగి చెల్లించడం కష్టంగా మారింది. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు అనిత వద్ద ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించాలని పథకం రచించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నవంబరు 11న మధ్యాహ్నం అనిత ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో రాజ్కుమార్ హెల్మెట్ ధరించి ఆమె నివాసంలోకి ప్రవేశించాడు. అయితే అతడిని అనిత గుర్తుపట్టింది. ఆమె గట్టిగా కేకలు వేయడంతో తన ప్రయత్నం బయటపడుతుందనే భయంతో సమీపంలో ఉన్న ఇస్త్రీ పెట్టెతో తలపై దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆమె బంగారు పుస్తెలతాడు, గాజులను అపహరించి, నగలను దాచిపెట్టి తన ఇంటికి వెళ్లిపోయాడు. సాయంత్రం పాఠశాల నుంచి తిరిగివచ్చిన పిల్లలకు తల్లి రక్తపు మడుగులో కనిపించడంతో తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే తండ్రికి సమాచారం అందించారు. అనితను డీఆర్డీవో అపోలో ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

సమాచారం అందుకున్న మీర్పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇంట్లో బలవంతపు ప్రవేశానికి సంబంధించిన ఆనవాళ్లు లేకపోవడం, బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పరిచయస్తుల ప్రమేయంపై దృష్టి సారించారు. సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించారు.

దర్యాప్తులో రాజ్కుమార్పై అనుమానం రావడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, హెల్మెట్, దుస్తులు, మొబైల్ ఫోన్, నేరానికి ఉపయోగించిన వస్తువును స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్కుమార్రెడ్డి నవంబరు 12న వెల్లడించారు. ఆర్థిక నష్టాల నుంచి బయటపడాలనే ప్రయత్నం ఒక మహిళ ప్రాణాలను బలిగొనడంతోపాటు ఇద్దరు చిన్నారులను తల్లికి దూరం చేసింది. ఈ ఘటన ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని మిగిల్చింది.

(హెచ్. ప్రతాప్)



మడ్ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్

- రూ.50 లక్షల ఎస్డీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన వసతుల పరిశీలన
- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు ప్రోత్సాహం.. పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపితే సహకారం

సికింద్రాబాద్ : కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మడ్ఫోర్ట్ ప్రభుత్వ హైస్కూల్ను శుక్రవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఎమ్మెల్యే స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్స్ నుంచి మంజూరైన రూ.50 లక్షల వ్యయంతో పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మంచినీటి ఆర్ఓ ప్లాంట్, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్లను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. 8వ తరగతిలో ఉపాధ్యాయుడు పాఠం బోధిస్తున్న తీరును స్వయంగా పరిశీలించి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, డాక్టర్లు, ఇంజనీర్లు, న్యాయవాదులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఎంపికయ్యే విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వ్యాసరచన, క్రీడా, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వచ్చే గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బహుమతులు అందజేస్తామని ప్రకటించారు.కంటోన్మెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణేష్, సీనియర్ ఉపాధ్యాయురాలు శ్రీలత ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు ఇందిర, ప్రభాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత

కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్ : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంది రమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రాష్ట్రంలోని ప్రతి కుటుం బానికి ఆర్థిక భద్రత, సామాజిక రక్షణ కల్పించడమే ముఖ్య ఉద్దేశమని మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. ఈ పథకాన్ని నవంబర్ 19 న ప్రారంభించనున్నారనీ అన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి 18 నుండి 59 సంవత్సరాల వయస్సు గల వారు బీమా పొందేందుకు అర్హుల న్నారు. వయస్సు నిర్ధారణ కోసం ఆధార్ కార్డులో నమోదు చేయబడిన పుట్టిన తేదీని పరిగణలోకి తీసుకుంటారన్నారు. ఈ పథకం కింద సభ్యుడు మరణించినట్లయితే అతని కుటుంబానికి ప్రభుత్వం నుండి 5 లక్షల రూపాయల బీమా మొత్తం చెల్లించబడుతుంద న్నారు. ఈ పథకం కింద నమోదు చేసుకోవడానికి కుటుంబ పెద్ద వివరాలు, నామినీ వివరాలు నమోదు చేయవలసి ఉంటుందన్నారు. బీమాదారులను నమోదు చేయడానికి గ్రామం, వార్డు స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడతాయని, డేటా సేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత డిజిటల్ డేటా, సంతకం చేసిన దరఖాస్తు పత్రాల స్కాన్ చేసిన కాపీలను బీమా కంపెనీతో పంచుకుంటారన్నారు.

క్లెయిమ్ ప్రాసెసింగ్ విధానం

గ్రామీణ ప్రాంతాలలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మరణ వివరాలను సేకరించి, వెబ్ పోర్టల్ ద్వారా అప్లోడ్ చేసి, ఎంపిడిఓకి పంపుతారనీ, ఎంపిడిఓ క్లెయిమ్ ప్రామాణికతను పరిశీలించి చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కు పంపుతార న్నారు. సిపిఓ డిఆర్డిఓ పరిశీలన తర్వాత ఆమోదం కోసం జిల్లా కలెక్టర్ కు సమర్పిస్తారనీ, జిల్లా కలెక్టర్ క్లెయిమ్ ను ఆమోదించి తుది



సెటిల్మెంట్ కోసం బీమా కంపెనీకి పంపుతారన్నారు. బీమా కంపెనీ క్లెయిమ్ ను ప్రాసెస్ చేసి రూ.5 లక్షల నామినీలకు బదిలీ చేస్తుందన్నారు. పట్టణ ప్రాంతాలలో మున్సిపాలిటీలలో వార్డు ఆఫీసర్ ప్రారంభించి మున్సిపల్ కమిషనర్ పరిశీలించి సిపిఓ పిడి మెప్మా పరిశీలించి జిల్లా కలెక్టర్ ఆమోదించి బీమా కంపెనీకి పంపుతారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్లలో వార్డు ఆఫీసర్ ప్రారంభించి, డిప్యూటీ కమిషనర్ పరిశీలించి, మున్సిపల్ కమిషనర్ ఆమోదించి బీమా కంపెనీకి పంపుతారని కలెక్టర్ వివరించారు.




శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో

పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్ : హైదరాబాద్లోని అంబర్పేట్ డీడీ కాలనీలో మాజీ రాజ్యసభ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి. హనుమంతరావు నివాసంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ శ్రీ సత్యనారాయణ స్వామివారి దివ్య ఆశీస్సులు ప్రజలం దరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ స్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు.

ఆ సమయంలో కన్నీళ్లు ఆగలేదు: సాయిపల్లవి

ఇటీవల విడుదలైన 'రామాయణ'లో సీతగా కనిపించారు నటి సాయిపల్లవి. ఆ సినిమా షూటింగ్ సమయంలో ఎదురైన ఓ భావోద్వేగ అనుభవాన్ని తాజాగా గుర్తుచేసుకున్నారు. ఓ సన్నివేశం పూర్తయిన తర్వాత తన డైలాగ్ కోచ్ వచ్చి తన పాదాలకు నమస్కరించారని.. దీంతో తాను కన్నీళ్లు పెట్టుకున్నట్లు వెల్లడించారు. "నా డైలాగ్ కోచ్ చేసిన పనికి నేను ఆశ్చర్యపోయాను. ఆమెకు నేను సాయిపల్లవినని తెలుసు. కానీ ఆమె ప్రతిరోజూ పూజించే ఓ పాత్రలో నన్ను చూసినప్పుడు ఎమోషనల్ అయింది. ఎదుట ఉన్నది ఆ పాత్రలో నటించిన నేను అని ఆమె అనుకోలేదు. ఆ పాత్రపై ప్రేమను మాత్రమే చూపించాలనుకుంది" అని సాయిపల్లవి తెలిపారు. ఆ ఘటన తర్వాత తనకు కన్నీళ్లు ఆగలేదని సాయిపల్లవి తెలిపారు. "మీరు అసలు ఏం చేస్తున్నారు?' అని అడిగాను. ఆ క్షణమే ఆ పాత్ర ఎంతోమంది మనసులకు హత్తుకుంటుందని నాకు అర్థమైంది. ఇంతటి ప్రేమను పొందడం నా అదృష్టం" అని సాయిపల్లవి చెప్పారు.





'రియాలిటీ' నుంచి మరో మెలోడీ

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'రియాలిటీ' నుంచి మరో అందమైన మెలోడీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా నుంచి రెండో సింగిల్‌గా విడుదలైన 'రుత్తూ' పాట యువతను ఆకట్టుకునేలా ప్రేమభరితమైన విజువల్స్, మధురమైన సంగీతంతో అలరిస్తోంది. కిరణ్ అబ్బవరం, దేవికా భట్ జంట మధ్య కనిపిస్తున్న కెమిస్ట్రీ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సాంగ్‌కు ప్రముఖ గాయకుడు కపిల్ కపిలన్ తన మధురమైన గాత్రాన్ని అందించగా, పూర్ణాచారి సాహిత్యాన్ని రచించారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మరోసారి తనదైన సంగీతంతో పాటకు ప్రత్యేకమైన అందాన్ని తీసుకొచ్చారు. ఇక ఈ సినిమాతో కిరణ్ అబ్బవరం దర్శకుడిగా కూడా పరిచయం అవుతుండటం విశేషం.

దేవుడి దయతో బతికా : కాజల్


స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన కెరీర్‌లో ఎదుర్కొన్న ఒక భయంకరమైన అనుభవాన్ని గుర్తుచేసుకుని ఎమోషనల్ కామెంట్స్ చేశారు. 2020 ఫిబ్రవరిలో చెన్నైలోని ఈవీపీ ఫిల్మ్ సిటీలో కమల్ హాసన్ 'ఇండియన్ 2' షూటింగ్ జరుగుతున్న సమయంలో భారీ క్రేన్ కూలి ముగ్గురు టెక్నీషియన్లు మరణించిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదం నుంచి తాను తృటిలో ఎలా బయటపడ్డానో తాజాగా, కాజల్ ఓ ఇంటర్వ్యూలో పంచుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రాత్రి ఒక భారీ యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేస్తున్నామని, తామంతా మానిటర్ వెనుక ఒక టెంట్‌లో కూర్చున్నామని కాజల్ చెప్పారు. ఆ సమయంలో తాను 80 ఏళ్ల వృద్ధురాలి ప్రోస్థెటిక్ మేకప్‌లో ఉన్నానని, ఒక్కసారిగా సెట్‌లో అందరూ పరుగులు తీయడం చూసి ఏం జరుగుతుందో తెలియక తాను కూడా పరిగెత్తానని తెలిపారు. ఆ కంగారులో ఒక టేబుల్‌కు తట్టుకుని కింద పడబోతూ వెనక్కి తిరిగి చూడగా, 100 అడుగుల భారీ క్రేన్ సరిగ్గా తన వైపే కూలిపోతూ కనిపించిందని చెప్పారు. ఆ క్షణం భయంతో తన శరీరం గడ్డకట్టుకుపోయిందని, ఇక తన ప్రాణాలు పోతాయని అనుకున్నానని కాజల్ పేర్కొన్నారు. కానీ క్షణాల్లో ఏదో ఒక అదృశ్య చెయ్యి తనను ఆ టెంట్ లోపలి నుంచి బలంగా బయటకు లాగేసిందని, వెంటనే ఆ క్రేన్ తన పక్కనే కుప్పకూలిందని చెప్పారు. ఆ తర్వాత చుట్టూ చూస్తే ఎవరూ లేరని, తన స్టాఫ్ కూడా అప్పుడు దూరంగా ఉన్నారని తెలిపారు. ఆ రోజు దేవుడి దయ, ఏదో దివ్య శక్తి వల్లే తాను బతికి బయటపడ్డానని లేదంటే ఆ ప్రమాదంలో తానే ముందుగా చనిపోయేదాన్ని అని అన్నారు. ఇక ఈ ఘటనతో తన కుటుంబం కూడా తీవ్ర భయాందోళనకు గురైందని కాజల్ ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



'డీఎన్‌కే'.. నవ్వుల్లేవు.. థ్రిల్ లేదు!

'లిటిల్ హార్ట్స్' చిత్రంతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించి.. తొలి ప్రయత్నంలోనే చక్కటి విజయాన్ని ఖాతాలో వేసుకున్నాడు మౌళి. ఇప్పుడాయన నుంచి వచ్చిన రెండో సినిమా 'డీఎన్‌కే'. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం నేడు థియేటర్లలోకి వచ్చింది. మరి ఈ చిత్ర కథేంటి? మౌళి మరోసారి సినీప్రియుల్ని అలరించారా?

వైజాగ్‌కి చెందిన ఓ మధ్యతరగతి కుర్రాడు ఈశ్వర్ (మౌళి). బీటెక్ మధ్యలో ఆపేసి అప్పులు చేసుకుంటూ.. బెట్టింగ్స్ వేస్తూ ఆవారాలా జీవితాన్ని గడిపేస్తుంటాడు. ఈక్రమంలోనే ప్రేమించిన అమ్మాయి దీపు (సుష్మిత శెట్టి)కి కూడా మాయమాటలు చెప్పి ఆమె దగ్గర్నుంచి రూ.10 లక్షల విలువైన బంగారం, డబ్బులు కాజేస్తాడు. తీరా ఈ విషయం ఆమె ఇంట్లో వాళ్లకి తెలియడంతో ఈశ్వర్‌కి సమస్యలు మొదలవుతాయి. ఓ వైపు ప్రేమించిన అమ్మాయి తండ్రి తమ డబ్బు తిరిగి ఇవ్వాలని పట్టుబట్టడం.. మరో వైపు అప్పుల వాళ్ల నుంచి ఎదురయ్యే ఒత్తిడిని తట్టుకోలేక మిత్రుడితో కలిసి దొంగతనం చేయడానికి సిద్ధపడతాడు. ఈక్రమంలోనే ఓ నగల దుకాణాన్ని దోచుకునేందుకు ప్రణాళిక రచించగా.. అక్కడ తనకు ఊహించని ఎదురు దెబ్బ తగులుతుంది. మరి అదేంటి? అసలు జ్యువెలరీ షాప్‌లో ఏం జరిగింది? ఆ దొంగతనం వల్ల తను.. తన కుటుంబం ఎలాంటి చిక్కుల్లో పడింది? ఈ కథలో కథానాయక తండ్రి పుల్లయ్య (రఘుబాబు), గుండుబాస్ (గుండు సుదర్శన్) తదితరుల పాత్రలకి ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి.



ఎలా సాగిందంటే..


ఇదొక రొటీన్ క్రైమ్ కామెడీ సినిమా. పోకిరిగా తిరిగే ఓ కుర్రాడు తేలికగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలకు సిద్ధపడటం.. ఈక్రమంలో ఓ హత్య కేసులో ఇరుక్కోవడం.. ఆఖరికి దాని నుంచి ఎలా బయటపడ్డాడన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. దర్శకుడు రాసుకున్న స్క్రిప్ట్‌లో కానీ.. తెరపై కనిపించే సన్నివేశాల్లో గానీ ఏమాత్రం బలం కనిపించదు. కథని ఆరంభించిన తీరు.. దాన్ని ముగించిన విధానం ఏ ఒక్కటీ ప్రేక్షకుల్ని అలరించదు. ప్రథమార్ధమంతా ఈశ్వర్ చేసే తింగరి పనులు.. ప్రేమ వ్యవహారం చుట్టూనే తిరుగుతుంది. కానీ, అందులో ఏ సీక్వెన్స్ కూడా సినీప్రియుల్ని ఆకట్టుకోదు. ఇక ద్వితీయార్ధం నుంచి ప్రేక్షకుల సహనానికి అసలు పరీక్ష మొదలవుతుంది. జ్యువెలరీ షాప్ దోపిడీ వెనకున్న అసలు నేరస్థుల్ని హీరో ఎలా పట్టుకున్నాడన్నది ద్వితీయార్ధానికి కీలకం. దీన్ని ఓ కన్ఫ్యూజన్ డ్రామాలా నడిపిస్తూ.. ప్రేక్షకుల్ని నవ్వించే ప్రయత్నం చేశారు దర్శకుడు. కానీ, అదెక్కడా వర్కవుట్ అవ్వలేదు. ప్రీక్లైమాక్స్‌లో జైకృష్ణ పాత్ర తెరపైకి వచ్చినప్పటి నుంచి కథలో కాస్త నవ్వులు మొదలవుతాయి. క్లైమాక్స్‌ని కొన్ని ట్విస్ట్‌లతో తీర్చిదిద్దారు. కానీ, అప్పటికే శుభం కార్డు కోసం ఎదురు చూస్తున్న ప్రేక్షకులకు అవేమీ థ్రిల్ పంచవు. 'లిటిల్ హార్ట్స్'లో అమాయకత్వమైన నటనతో, తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించిన మౌళి ఈ సినిమాలో తేలిపోయాడు. రచనలో బలం లేకపోవడం తెరపై కనిపించే ప్రతి పాత్రపైనా ప్రభావం చూపించింది. కథానాయికగా సుష్మితకి ఈ కథలో ఏమంత ప్రాధాన్యత దక్కలేదు. అలీ, రజిత తమ పరిధిలో మెప్పించే ప్రయత్నం చేశారు. జైకృష్ణ తెరపై కనిపించినంత సేపూ ప్రేక్షకుల్ని నవ్వించాడు. దర్శకుడి రాతలో.. తీతలో ఏమాత్రం కొత్తదనం లేదు. సింజిత్ సంగీతం ఫర్వాలేదనిపిస్తుంది.

సత్యవాన్ సావిత్రి ట్రైలర్ రిలీజ్..


కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి'. ప్రవీణ్ ఎస్. విజయ్ దర్శకత్వంలో కామెడీ, కోర్టు డ్రామాగా రూపొందుతోంది. నవంబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో కీర్తి లాయర్‌గా కనిపించారు. బలవంతంగా పెళ్లి చేసుకున్నప్పటికీ హత్య కేసులో చిక్కుకున్న భర్తను కాపాడేందుకు ఆమె ఏం చేశారనేది కథాంశం.

కూల్‌డ్రింక్, చిప్స్ కంటే మొబైల్ రీఛార్జే చీప్

సునీల్ మిత్తల్ ఆసక్తికర వ్యాఖ్యలు



భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం భారత్‌లో టెలికాం టారిఫ్‌లు చాలా తక్కువగా ఉన్నాయన్న ఆయన.. కూల్‌డ్రింక్, చిప్స్ ప్యాకెట్ కంటే మొబైల్ రీఛార్జి ధరలే తక్కువ ఉన్నాయని అభిప్రాయపడ్డారు. యూజర్లు సగటున నెలకు సుమారు రూ.350 వరకు చెల్లించడం సముచితంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. భారతీ ఎంటర్‌ప్రైజెస్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మొబైల్ కనెక్షన్ ద్వారా ఒకప్పటిలా యూజర్లు కేవలం కాలింగ్ మాత్రమే చేయడం లేదని, బ్యాంకింగ్, యూపీఐ చెల్లింపులు, విద్య, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు వంటివి వినియోగిస్తున్నారని సునీల్ మిత్తల్ అన్నారు. ఈ సేవలకు గానూ టెలికాం వినియోగదారులు చెల్లిస్తున్న మొత్తం తక్కువేన్నారు. యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం నెలకు రూ.350 ఉంటే సమంజసంగా ఉంటుందన్నారు. ఆ లెక్కన రోజుకయ్యే ఖర్చు రూ.10-12 మాత్రమేనని పేర్కొన్నారు. నెట్‌వర్క్ నిర్వహణ వ్యయం, ఉద్యోగుల జీతాలు, విద్యుత్ ఛార్జీల రూపంలో ఖర్చులు భారీగా పెరిగాయని చెప్పారు. దీనికి తోడు మౌలిక సదుపాయాలకు ఇంకా ఖర్చు చేయాల్సి ఉందన్నారు. చైనాలో 10 లక్షలకు పైగా మొబైల్ టవర్లు ఉండగా.. భారత్‌లో ఆ సంఖ్య 3.5 లక్షలు మాత్రమేనని తెలిపారు. ఆ మేర టవర్ల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందన్నారు. దీనికితోడు 5జీపై పెద్దమొత్తంలో ఖర్చు చేసినప్పటికీ.. ఆశించిన స్థాయిలో ప్రతిఫలం రావడం లేదన్నారు. నెట్‌వర్క్ విస్తరణకు మరో రూ.1.5 లక్షల కోట్లు అవసరం పడుతుందని చెప్పారు.



బిజినెస్



ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయం

న్యూఢిల్లీ : టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సేవల్లో శుక్రవారం కొన్ని గంటలపాటు అంతరాయం నెలకొంది. ప్రపంచ దేశాల్లోని అన్ని మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలపై దీని ప్రభావం పడింది. ఈ సమస్య వల్ల మైక్రోసాఫ్ట్ 365, అవుట్‌లుక్, టీమ్స్ సహా ఇతర మైక్రోసాఫ్ట్ అప్లికేషన్‌లలో అంతరాయం చోటుచేసుకుంది. దీనివల్ల వేలాది మంది వినియోగదారులు వెబ్, డెస్క్‌టాప్ అప్లికేషన్‌లు, మొబైల్ కనెక్షన్‌ల ద్వారా అవుట్‌లుక్‌లో తమ మెయిల్‌బాక్స్‌లను యాక్సెస్ చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెయిల్ డెలివరీ కూడా ఆలస్యమైంది. తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో అవుట్ లుక్ సమస్యలపై దాదాపు లక్షకు పైగా ఫిర్యాదులు అందినట్లు డౌన్‌డిటెక్టర్ తెలిపింది. ఉదయం 4.30 గంటలకల్లా ఫిర్యాదులు తగ్గుముఖం పట్టినట్లు వెల్లడించింది. ఈ ఘటనపై మైక్రోసాఫ్ట్ స్పందించింది. ప్రభావిత సర్వర్లను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపింది. క్రమంగా తమ సేవలు మెరుగవుతున్నాయని పేర్కొంది. ప్రభావిత సర్వర్లలో సురక్షిత కనెక్షన్‌లను ఏర్పాటు చేసే ప్రక్రియే ఈ అంతరాయానికి కీలక కారణమని తమ దర్యాప్తులో గుర్తించినట్లు వెల్లడించింది. ఆ ప్రక్రియ వల్ల సర్వర్లపై అధిక భారం పడడంతో అవి కొంతసేపు మొరాయించినట్లు తెలిపింది. ప్రభావిత మౌలిక సదుపాయాలను పునఃప్రారంభించడంతో పాటు.. ఇతర అంశాలు కారణవ-ఐయ్యాయా? అనే విషయాన్ని తెలుసుకోవడానికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పింది. ఈ అంతరాయం వల్ల ప్రభావితమైన సేవల్లో మైక్రోసాఫ్ట్ ప్లానర్, టుడూ, డిఫెండర్, పర్‌ప్యూ, గ్రాఫ్, ఫ్యాబ్రిక్, పవర్ బిఐ, షేర్‌పాయింట్ ఆన్‌లైన్, యూనివర్సల్ ప్రింట్ విండోస్ 365 వంటివి ఉన్నట్లు స్పష్టం చేసింది.

ఓపెన్ ఏఐ, ఆంథ్రోపిక్‌లపైనా ప్రభావం..

ఈ సమస్య వల్ల మైక్రోసాఫ్ట్ సొంత అప్లికేషన్లు మాత్రమే కాకుండా దాని మౌలిక సదుపాయాలపై ఆధారపడిన థర్డ్-పార్టీ సేవలు కూడా ప్రభావితమయ్యాయి. మైక్రోసాఫ్ట్ 365 కనెక్టర్ల ద్వారా ఓపెన్ ఏఐ ఆంథ్రోపిక్ ఏఐ సేవల్లోనూ అంతరాయం నెలకొంది. మైక్రోసాఫ్ట్ కనెక్టర్లతో ఉన్న ఒక సమస్యపై తాము దర్యాప్తు చేస్తున్నామని.. అది కొత్త కనెక్షన్లను నిరోధించే అవకాశం ఉందని ఓపెన్‌ఏఐ తెలిపింది. తమ మైక్రోసాఫ్ట్ 365 కనెక్టర్‌ను ప్రభావితం చేస్తున్న ఒక అప్‌స్ట్రీమ్ ప్రొవైడర్‌లో సమస్యను గుర్తించినట్లు ఆంథ్రోపిక్ వెల్లడించింది. ఈ అంతరాయం కారణంగా తమ వ్యాపారానికి ఆటంకాలు ఏర్పడ్డాయని ఎలక్ట్రిక్ ట్రక్కుల తయారీ సంస్థ వర్క్‌హార్స్ గ్రూప్ పేర్కొంది. దీంతో తన మూడో త్రైమాసిక ఫలితాల ప్రకటనను వాయిదా వేసింది. మైక్రోసాఫ్ట్‌లో చోటుచేసుకున్న అంతరాయం ప్రభావం దేశ రాజధాని దిల్లీలో విమానయాన సేవలపై పడింది. దిల్లీ నుంచి మూడు విమానాలను రద్దు చేసినట్లు స్పైస్‌జెట్ వెల్లడించింది. మరో రెండు విమానాలు ఆలస్యమైనట్లు తెలిపింది. ఇతర విమానయాన సంస్థలు కూడా ప్రయాణికులకు పలు సూచనలు చేశాయి. విమాన ప్రయాణాలకు సంబంధించిన అప్‌డేట్‌లను నిరంతరం పరిశీలించుకోవాలని ఇండిగో, ఆకాశ ఎయిర్ తెలిపాయి. మైక్రోసాఫ్ట్ అంతరాయాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు ఎయిరిండియా వెల్లడించింది. అయితే దీని కారణంగా తమ విమాన కార్యకలాపాలపై ఎటువంటి ప్రభావం పడలేదని స్పష్టం చేసింది.



నా భార్యతో గొడవా..? హాస్యాస్పదంగా ఉంది : కమిన్స్

భార్యతో గొడవ పడినట్లు వచ్చిన వార్తలను ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ పాట్ కమిన్స్ కొట్టిపారేశాడు. తమ వ్యక్తిగత జీవితంలోకి మీడియా చొరబడుతోందని విమర్శించాడు. ఆసీస్ మాజీ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా రాసిన పుస్తకం విషయంలో సిడ్నీలోని తన ఇంటి బయట భార్య బెక్కీతో గొడవ జరిగిందన్న ప్రచారంపై కమిన్స్ మాట్లాడాడు. "బెక్కీ తన మనసులో ఉన్నది ఉన్నట్లు బయటపెడతుంది. ఎనిమిదేళ్ల క్రితం అంశం గురించి ఇప్పుడు మనం మాట్లాడుకోవడం విడ్డూరంగా ఉందికదా. ఏడాది వయసున్న నా కూతురితో బయట నడుస్తుంటే.. కెమెరాలు నన్ను, నా కుటుంబాన్ని వెంటాడుతున్నాయి. నా వరకు ఆ విషయం హాస్యాస్పదంగానే ఉంది. మా మధ్య ఎటువంటి విభేదాలు లేవు. ఉస్మాన్ వ్యవహారంతో బెక్కీ తీవ్ర అసహనంతో ఉంది. ఆమె ఏమాత్రం సంతోషంగా లేదు. ఆమె ఎప్పుడూ నిజాయతీగా ఉండు అంటుంది. ఆ పర్యటన కంటే చాలా కాలం ముందు నుంచి బెక్కీ నాతో ఉంది. ప్రతి విషయాన్నీ ఆమె చూసింది. జట్టులో ప్రతి ఒక్కరు బాధపడుతుండటంతో నా ఎమోషన్స్‌ను బయటపెట్టాలని ఆమె కోరింది " అని మాత్రం చెప్పాడు. ఈ వారం ఆస్ట్రేలియాలో నేషనల్ రీసైక్లింగ్ వీక్ కావడంతో తాను ఇంటి బయట ఆ పనులు చేసుకుంటున్నట్లు వివరించాడు.



తేడాబ్యాటు

కివీస్‌దే నాలుగో వన్డే .. భారత్ ఘోర పరాజయం

టాస్ నెగ్గాం.. పిచ్ నుంచి బౌలింగ్‌కు సహకారం లభిస్తుంది కదా.. ఇక్కడే సిరీస్‌ను కైవసం చేసుకుని వెళ్దామనే టీమ్‌ఇండియా ఆశలకు న్యూజిలాండ్ బ్రేక్ వేసింది. తొలుత భారీ స్కోరు చేసిన కివీస్.. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ చెలరేగి భారత్‌ను చిత్తు చేసింది. న్యూజిలాండ్ బౌలింగ్ దెబ్బకు టీమ్‌ఇండియా బ్యాటింగ్ లైనప్ కకావికలమైంది. టాప్-3 బ్యాటర్లు డకౌట్ కావడంతో టీమ్‌ఇండియా పతనం తొలి ఓవర్‌లోనే మొదలైంది. అక్కడ నుంచి ఏమాత్రం కోలుకోలేదు.



భారత్‌తో మౌంట్ మౌంగనుయ్ వేదికగా జరిగిన నాలుగో వన్డేలో న్యూజిలాండ్ ఏకంగా 244 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడిన కివీస్ 50 ఓవర్లలో 333 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ విల్ యంగ్ (125)సెంచరీ సాధించగా.. మరో ఓపెనర్ టిమ్ సీఫర్ట్ (58) అర్ధశతకం సాధించాడు. అనంతరం టీమ్‌ఇండియా 26.4 ఓవర్లలో కేవలం 89 పరుగులకే కుప్పకూలింది. ఇషాన్ కిషన్ (27) టాప్ స్కోరర్ కాగా.. అక్షర్ పటేల్ (21), నమన్ ధిర్ (21) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మ్యాట్ హెన్రీ (6/27) ఫైఫర్‌తో భారత్‌ను దెబ్బ కొట్టాడు. అతడితోపాటు మాథ్యూ ఫిషర్ (3/31), జేమీసన్ (1/12) అదరగొట్టారు. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 2-1కి తగ్గింది. చివరి మ్యాచ్ ఆదివారం మౌంట్ మౌంగనుయ్ మైదానంలోనే జరగనుంది. మూడో వన్డే వర్షం కారణంగా రద్దైన సంగతి తెలిసిందే. ఐదో వన్డేలో టీమ్‌ఇండియా గెలిస్తే సిరీస్ సొంతమవుతుంది. ఒకవేళ రద్దు అయినా మనదే సిరీస్. అలా కాకుండా న్యూజిలాండ్ గెలిస్తే మాత్రం సిరీస్ సమమవుతుంది.

మాట్ హెన్రీ దెబ్బకు కుదేలు

లక్ష్యం 334 పరుగులు.. సరేలే టీమ్‌ఇండియా బ్యాటర్లు మంచి ఫామ్‌లోనే ఉన్నారు కదా.. అని అభిమానులు మ్యాచ్‌ను చూసేందుకు సిద్ధమయ్యేలోపే భారీ షాక్ ఇచ్చాడు కివీస్ బౌలర్ మాట్ హెన్రీ. తొలి బంతికే రోహిత్‌ను స్లిప్‌లో క్యాచ్‌తో పెవిలియన్‌కు చేర్చగా.. ఐదో బంతికి విరాట్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ మరుసటి బంతికే శ్రేయస్‌ను ఎల్బీ చేసి హెన్రీ దెబ్బ కొట్టాడు. ఒకే ఓవర్‌లో ఈ ముగ్గురూ డకౌట్ కావడం గమనార్హం. ఆ కాసేపటికే రుతురాజ్ గైక్వాడ్ (5)ను ఔట్ చేసి జేమీసన్ షాక్ ఇచ్చాడు. మరోవైపు ఇషాన్ కిషన్ క్రీజ్‌లో పాతుకుపోయి ఉండటంతో ఏమైనా అద్భుతాలు జరుగుతాయేమోనని ఫ్యాన్స్ ఆశించారు. అక్షర్ పటేల్‌తో కలిసి ఇషాన్ ఇన్నింగ్స్‌ను నెమ్మదిగా ముందుకు నడిపించాడు. మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన హెన్రీ కీలకమైన ఇషాన్‌ను ఔట్ చేసి భారత్ ఆశలకు ముగింపు పలికాడు. ఆఖర్లో నమన్ ధిర్ భారీషాట్లు కొట్టినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. ఈసారి ఫిషర్ రంగంలోకి దిగి టపాటపా వికెట్లను పడగొట్టాడు. సున్నాకే రోహిత్, విరాట్, శ్రేయస్ పెవిలియన్‌కు చేరడం భారత ఇన్నింగ్స్‌పై పెద్ద ప్రభావం చూపించింది.

ఆ క్యాచ్‌లను వదిలేయడంతో..

పిచ్ నుంచి లభించే సహకారంతో కివీస్‌ను కట్టడి చేద్దామని భావించిన భారత కెప్టెన్ శ్రేయస్ టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకున్నాడు. కానీ, ఓపెనర్లు విల్ యంగ్, టిమ్ సీఫర్ట్ తొలి వికెట్‌కు 85 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అకిబ్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లోనే విల్ యంగ్ ఇచ్చిన క్యాచ్‌లను భారత్ వదిలేసింది. చివరికి అతడు సూపర్ సెంచరీతో కివీస్‌కు భారీ స్కోరు అందించాడు. ఫిన్ అలెన్ (41), మిచెల్ శాంట్నర్ (24), క్రిస్టియన్ క్లార్కె (22), కైల్ జేమీసన్ (19లి), మైకెల్ బ్రాస్‌వెల్ (15) విలువైన పరుగులు చేశారు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ 2, అకిబ్ నబీ 2, అక్షర్ పటేల్ 2.. అర్ష్‌దీప్, నమన్ చెరో వికెట్ తీశారు.



ఆర్‌ఏసీ రద్దు యోచనలో రైల్వే శాఖ..?

రైల్వే ప్రయాణికులు ఎదుర్కొనే ప్రధాన సమస్యల్లో రిజర్వేషన్ అగైనెస్ట్ క్యాన్సిలేషన్ ఒకటి. పూర్తి స్థాయిలో టికెట్ ధర చెల్లించినా.. చాలీచాలని సీటులో కూర్చుని ప్రయాణం చేయాల్సిందే. ఒకసారి ప్లాన్ చేసుకున్నాక వాయిదా వేసుకోలేని పరిస్థితుల్లో చాలా మంది అలానే ప్రయాణిస్తుంటారు. ఏళ్లుగా ఉన్న ఈ సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. దీన్ని రద్దు చేయాలని రైల్వే శాఖ భావిస్తోంది. సాధారణంగా రైళ్లలో బెర్తులు తగినన్ని అందుబాటులో లేనప్పుడు ఆర్‌ఏసీ కోటాలో సీట్లు కేటాయిస్తుంటారు. పూర్తిస్థాయిలో టికెట్ కన్ఫార్మ్ కానప్పటికీ.. రైళ్లలో ప్రయాణానికి అనుమతిస్తారు. ఒక సైడ్ బెర్త్‌ను ఇద్దరికి కేటాయిస్తుంటారు. పొరపాటున స్త్రీ, పురుషులకు ఒకే బెర్త్ కేటాయింపు జరిగినప్పుడు.. సర్దుబాటు చేయడానికి టీటీఈలు కూడా నానా తంటాలు పడుతుంటారు. ఇదే అంశాన్ని పార్లమెంటరీ ప్యానెల్ లేవనెత్తింది. అరకొర ప్రయాణం చేసినా పూర్తి టికెట్ ధరను వసూలు చేయడంలో హేతుబద్ధతను ప్రశ్నించింది. ఈ రిజర్వేషన్ పద్ధతిని సమీక్షించాలని రైల్వే శాఖకు సూచించింది. ఈ నేపథ్యంలో ఆర్‌ఏసీ విధానాన్ని రద్దు చేసే అంశాన్ని భారతీయ రైల్వే పరిశీలిస్తున్నట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. ప్రస్తుతానికి దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. రైల్వే రిజర్వేషన్ టికెట్లు ఒకప్పుడు మాన్యువల్‌గా జరిగేవి. దీంతో ఎవరైనా టికెట్ రద్దు చేసుకుంటే ఆ బెర్తు ఖాళీగా ఉండేది. దీంతో ఆర్‌ఏసీ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఒకవేళ ఎవరైనా టికెట్ రద్దు చేసుకుంటే ఆ బెర్తు కేటాయించేవారు. అప్పట్లో ఈ టికెట్ క్యాన్సిలేషన్లను ట్రాక్ చేయడానికి ఎలక్ట్రానిక్ వ్యవస్థ లేని రోజుల్లో వచ్చిన ఆర్‌ఏసీ.. ఏళ్లుగా అలానే ఉండిపోయింది.



చెక్కు చెదరని రో'హిట్' రికార్డు..

భారత స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ పన్నెండేళ్ల కిందట నెలకొల్పిన రికార్డు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆ దిశగా ఏ ప్లేయర్ కూడా అడుగులు వేయలేకపోతున్నాడు. ఇంతకీ హిట్‌మ్యాన్ సృష్టించిన చరిత్ర ఏంటి? ఎవరిపై ఆ ఘనతను సాధించాడో ఓ లుక్ వేద్దాం.. వన్డేల్లో సెంచరీలు అంటే సహజమే. కాస్త కష్టమైనా డబుల్ సెంచరీలనూ చూశాం. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ తొలిసారి వన్డేల్లో ద్విశతకం బాది మార్గం చూపిస్తే.. హిట్‌మ్యాన్ రోహిత్ (=శీష్టత్ శాష్ట్రుతీఱ్ఱి) మాత్రం అందరూ అసూయపడేలా రెండు రికార్డులను తన పేరిట లిఖించాడు. అదే వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు, మూడు డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. 2014లో శ్రీలంకపై కేవలం 173 బంతుల్లో ఏకంగా 264 పరుగులు చేసి అదరహో అనిపించాడు. దీంతో లంకపై టీమ్‌ఇండియా 50 ఓవర్లలో 404/5 స్కోరు చేసింది. అనంతరం భారత బౌలర్ల దెబ్బకు శ్రీలంక 251 పరుగులకే కుప్పకూలింది. అంటే రోహిత్ కొట్టిన వ్యక్తిగత స్కోరు కంటే కూడా లంక ఇంకా తక్కువే చేసింది. క్రికెట్ ప్రపంచంలో రోహిత్ శర్మ మాత్రమే మూడు డబుల్ సెంచరీలు సాధించాడు. తొలుత 2013లో ఆస్ట్రేలియాపై 158 బంతుల్లో 209 పరుగులు చేసిన రోహిత్.. ఇక శ్రీలంకపై అత్యధిక వ్యక్తిగత స్కోరు (264) నమోదు చేశాడు. ఆ తర్వాత 2017లో లంకపైనే మొహాలీ వేదికగా 153 బంతుల్లో 208 పరుగులతో అజేయంగా నిలిచాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాత్రమే రెండు ద్విశతకాలతో రోహిత్ తర్వాత ఉన్నాడు.